స్తబ్ధుగా తిరుపతి రాజకీయం!

జనసేన, టిడిపి సఖ్యత ఓట్లు కీలకం!?

ప్రభాతవార్త-తిరుపతి:
రాయలసీమలోనే తిరుపతి నియోజకవర్గానికి కొంత ప్రత్యేకత ఉంది. ప్రపంచంలోనే హిందూ పుణ్యక్షేత్రంగా ప్రత్యేక గుర్తింపు పొందడం, ఇక్కడ గెలిచిన పార్టీ రాష్ట్రంలో అధికారం చేపడు తుందనే విశ్వాసం ఆయా పార్టీ నేతల్లో బలమైన సెంటిమెంట్‌గా మారింది. అంతేగాక అత్యధిక కాలం ముఖ్యమంత్రిగా పనిచేసిన, ప్రతిపక్షనేతగా వ్యవహరించి, వ్యవహరిస్తున్న టిడిపి అధినేత నారాచంద్రబాబునాయుడు సొంత జిల్లా కూడా కావడం మరొక ప్రత్యేకత. ఇప్పుడు 2024 ఎన్నికలకు సమయం దగ్గర పడుతుండటంతో తిరుపతి నియోజక వర్గంలోని అన్ని రాజకీయపార్టీ నేతల్లో కొంత హుషారు కనిపిస్తోంది.ప్రధాన పార్టీల నేతల రాజకీయం మాత్రం స్తబ్ధుగా మారింది. కారణాలు ఏవైనా ఎన్నికలు సమీపిస్తున్న కొద్దీ పార్టీలో బలమైన నేతలుగా ఎదగాలని ఆశపడుతూ, ఎవరు ఏ పార్టీ వీడుతారో,ఏ పార్టీలోకి జంప్ అయి కండువా కప్పుకుంటారనేది రాజకీయ వర్గాల్లో హాట్‌టాపిక్‌గా మారింది. సంవత్సరాల తరబడి ఉన్న పార్టీలో చురుగ్గా వ్యవహరించి, పలు కీలక పదవులు అనుభవించిన నేతలు కూడా అంత సులభంగానే పార్టీల కండువాలు మార్చేస్తారనే మాట జనం నోట వినిపిస్తోంది. ఇప్పుడు ప్రధాన ప్రతిపక్షం తెలుగుదేశం నుంచి మరోపార్టీలోకి వెళ్ళేందుకు ఒకరిద్దరు నేతలు అంతర్గతంగా చర్చలు, పావులు కదుపుకుంటున్నారనే చర్చ తిరుపతిలో మొదలైంది. 2019 ఎన్నికల ముందు వరకు టిడిపిలోనే ఉండి, కీలకమైన టిటిడి ఛైర్మన్ పదవిని కూడా అందుకున్న మాజీ ఎమ్మెల్యే చదలవాడ కృష్ణమూర్తి ఏకంగా పార్టీని వీడారు. గత ఎన్నికల్లో జనసేన పార్టీ తరపున తిరుపతి నియోజకవర్గంలో పోటీచేసి ఓటమిచెందారు. ఆ తరువాత పూర్తిగా రాజకీయాలకు దూరమయ్యారు. ఇక 2009వరకు కాంగ్రెస్ పార్టీలో కొనసాగిన దివంగత ఎమ్మెల్యే ఎం.వెంకట రమణ అదే సంవత్సరం కాంగ్రెస్ పార్టీని వీడి టిడిపిలోచేరారు. ఎమ్మెల్యేగా గెలుపొందారు. 2014లో ఆయన అనారోగ్యంతో అకాలమరణం చెందారు.దీంతో ఆయన కుటుంబం నుంచే సతీమణి మన్నూరు సుగుణమ్మ రాజకీయాల్లోకి ప్రవేశించింది. 2014 నుంచి 2019 వరకు ఆమె ఐదేళ్ళు తిరుపతి ఎమ్మెల్యేగా గెలిచి నియోజకవర్గంలో ప్రజలకు అందుబాటులో ఉన్నారు. ప్రజాసమస్యలు పరిష్కారంలో తనదైన పాత్ర పోషించారు .ఆ తరువాత 2019 ఎన్నికల్లో అతి తక్కువ మెజార్టీతో వైసిపి ప్రస్తుత సిట్టింగ్ ఎమ్మెల్యే భూమన కరుణాకర్‌రెడ్డి చేతిలో ఓటమిచెందారు. అప్పటి నుంచి సుగుణమ్మ టిడిపిలోనే కొనసాగుతూ పార్టీ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.గత ఎన్నికల్లో ఓటర్లు, ప్రజలు ,అభిమానులు, పార్టీ శ్రేణులు గట్టిగా పనిచేసినా ఫలితం ప్రతిఘటించింది. దీంతో ఆమె కొంతవరకు తిరిగి రాజకీయంగా నిలదొక్కుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నా, తన రాజకీయ వారసురాలిగా మనవరాలు కీర్తిని రంగప్రవేశం చేయించాలనే గట్టి పట్టుదలతో ఉన్నారు. అలాగే అధికార పార్టీ ,ప్రస్తుత సిట్టింగ్ ఎమ్మెల్యే భూమన కరుణాకర్‌రెడ్డి తన వారసుడిగా కుమారుడు భూమన అభినయ్‌రెడ్డిని రాజకీయ ప్రవేశం చేయించారు. 2021లో జరిగిన తిరుపతి నగరపాలకసంస్థ తొలి ఎన్నికల్లో కార్పొరేటర్‌గా ఏకగ్రీవం చేయించి, ప్రస్తుతం నగరపాలకసంస్థ కౌన్సిల్‌లో ఉపమేయర్ హోదాలో రాజకీయాలు ఒంటపట్టిస్తున్నారు. నగరంలో అన్ని డివిజన్లలో, రాజకీయాలకతీతంగా నగరంలో తిరుగుతూ ప్రజల సమస్యలు తెలుసుకుని పరిష్కరించడంలో తనవంతుగా యువనేత అభినయ్ పనితీరు సంతృప్తికరంగానే ఉన్నట్లు కరుణాకర్‌రెడ్డి ,ఆ పార్టీ వర్గాలు జోష్‌తో ఉన్నాయి.

తిరుమలలో కేంద్ర, రాష్ట్ర ఆర్థికమంత్రులు

తిరుమల,అక్టోబర్ 20ప్రభాతవార్తప్రతినిధి:
కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలాసీతారామన్, రాష్ట్ర ఆర్థికమంత్రి బుగ్గన రాజేంద్రనాథరెడ్డి గురువారం ఉదయం తిరుమలేశుని దర్శించుకున్నారు. ఆలయంలో ఆధ్యాత్మికభావనతో గడిపిన ఇద్దరు మంత్రులు ఆలయం వెలుపల భక్తులతో మమేకమై సరదాగా సంభాషించారు. తిరుమలలో భక్తుల సౌకర్యాలపై ఆరా తీశారు. పలువురు భక్తులు సెల్ఫీలు దిగారు. టిటిడి ఛైర్మన్ సుబ్బారెడ్డి, ఇఓ ధర్మారెడ్డి ,ఆలయ డిప్యూటీఇఓ రమేష్‌బాబు, అర్చకులు శ్రీవారి తీర్థప్రసాదాలు అందజేశారు.

నగరి కేంద్రంగా బియ్యం స్మగ్లింగ్

టి.ఆర్.కండ్రిగలో విజిలెన్స్ అధికారులు పట్టుకున్న రేషన్ బియ్యం (ఫైల్‌ఫోటో)

నగరి టు కాకినాడకు అక్రమ రవాణా - చోద్యం చూస్తున్న పోలీస్, రెవెన్యూ శాఖలు

తిరుపతి, ప్రభాతవార్త :
నగరి పట్టణం కేంద్రంగా రేషన్ బియ్యం స్మగ్లింగ్ యదేచ్ఛగా జరుగుతోంది. స్మగ్లర్లు బరితెగించి పట్టపగలే రేషన్ బియ్యాన్ని అక్రమ రవాణా చేస్తున్నా అటు రెవెన్యూ శాఖాదికారులు గాని ఇటు పోలీస్ శాఖాధికారులు గాని పట్టించుకోకుండా చోద్యం చూస్తున్నారు. నగరి మునిసిపాలిటీ పరిధిలోనే టి.ఆర్.కండ్రిగ, రాజీవ్‌నగర్ వద్ద శ్రీ షిర్డి సాయిబాబా ఆలయం సమీపంలోనూ బహిరంగంగా గొడౌన్‌లు నిర్వహిస్తూ అక్రమ బియ్యం వ్యాపారం చేస్తుండడం బట్టి ఇందులో రెవెన్యూ, పోలీస్ అధికారుల లోపాయికారీ సహాయం వున్నట్టు స్పష్టమవుతోంది. అడపా దడపా తిరుపతి నుంచి విజిలెన్స్ అధికారులు దాడులు చేసి బియ్యం నిల్వలు పట్టుకుంటున్నా అక్రమ వ్యాపారానికి అడ్డు, అదుపు లేకుండా పోతోంది. నగరితో పాటు చుట్టుపక్కల ప్రాంతాల నుంచి సేకరించిన బియ్యాన్ని నేరుగా కాకినాడకు తరలిస్తున్నారు. అక్కడ మిల్లర్లు బియ్యాన్ని పాలిష్ చేసి, ఒకొక్కసారి చేయకుండా కాకినాడ పోర్ట్ ద్వారా మలేషియా, తైవాన్, ఆఫ్రికా దేశాలకు తరలిస్తున్నారు. దీంతో స్మగ్లర్లు, మిల్లర్లకు డాలర్ల పంట పండుతోంది. కరోనా పుణ్యమా అని తెలుపు రంగు రేషన్ కార్డుదారులకు కేంద్ర ప్రభుత్వం ఉచితంగా బియ్యం పంపిణీ చేస్తోంది. ఈ పంపిణీని మరో మూడు నెలలు పాటు కేంద్ర ప్రభుత్వం పొడిగించింది. దాంతో పాటు రాష్ట్ర ప్రభుత్వం కేజీ ఒక రూపాయికి బియ్యం పంపిణీ చేస్తోంది. నగరి ప్రాంతంలో అధిక శాతం మంది ప్రజలు ఉప్పుడు బియ్యం (హాఫ్ బాయిల్డ్ రైస్) తింటారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పచ్చి బియ్యం పంపిణీ చేస్తాయి. అందువల్ల పచ్చి బియ్యాన్ని చాలా తక్కువ శాతం మంది రాగి సంగటి చేయడానికి తప్ప ఇంక దేనికీ వినియోగించరు. ఇది స్మగ్లర్లకు బాగా కలిసొచ్చింది. ప్రజల నుంచి బియ్యం సేకరించేందుకు ఆయా ప్రాంతాల్లో స్మగ్లర్లు తమ ఏజెంట్లను పెట్టుకున్నారు. ప్రజల నుంచి ఏజెంట్లు బియ్యం సేకరించి స్మగ్లర్లకు ఇస్తారు. ఒకొక్కసారి ఈ పచ్చి బియ్యాన్ని రైస్ మిల్లులో శుద్ధి చేయకుండానే నేరుగా కాకినాడకు తరలిస్తారు. కొన్ని సార్లు స్థానిక అవసరాలకు తగినట్టు రైస్ మిల్లులో పాలిష్ చేసి స్థానికంగా కూడా విక్రయిస్తున్నారు. ఒక కేజీ పచ్చి బియ్యాన్ని 10 రూపాయలకు కొనుగోలు చేసి రైస్ మిల్లుల్లో శుద్ధి చేసి తిరిగి అదే బియ్యాన్ని 25 కేజీల బ్యాగుల్లో నింపి ఒక కేజీ 30 నుంచి 35 రూపాయలకు వరకూ విక్రయిస్తున్నారు. ఇందులో సివిల్ సప్లయిస్ గొడౌన్‌ల నిర్వాహకుల పాత్ర కూడా లేకపోలేదు. ఒక నెలకు కనీసం 800 నుంచి 900 టన్నుల బియ్యాన్ని తరలిస్తున్నారు. దీని వల్ల అన్ని ఖర్చులు పోను స్మగ్లర్లకు సగటున ఒక రోజుకు ఒక లక్ష రూపాయలు మిగిలే అవకాశం వుంది. అయితే స్థానిక పోలీస్, రెవెన్యూ శాఖల అధికారులకు వాటాలు అందడం వల్లే ఆ రెండు శాఖలు ఈ భాగోతాన్ని పట్టించుకోవడం లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. కాని విజిలెన్స్ అధికారులు మాత్రం తరచూ దాడులు నిర్వహించి పట్టుకుంటూనే వున్నారు. నగరి నుంచి అక్రమ బియ్యం రవాణా చేసే లారీల్లో గత వారంలో ఒకటి రేణిగుంట వద్ద పట్టుబడింది. రెండు రోజుల క్రితం నగరి మునిసిపాలిటీ పరిధిలోని టి.ఆర్.కండ్రిగలో ఒక గొడౌన్‌లో దాచి వుంచిన 8 టన్నుల బియ్యాన్ని విజిలెన్స్ అధికారులు పట్టుకున్నారు. తరచూ పట్టుబడుతున్నా సరే... ఈ అక్రమ రవాణాలో వచ్చే ఆదాయం రుచి చూసిన స్మగ్లర్లు వెనక్కు తగ్గడం లేదు. అక్రమ రవాణాలో పట్టుబడిన లారీని సీజ్ చేసినా, కొంత జరిమానా విధించి దానిని విడుదల చేసేస్తున్నారు. నామ మాత్రంగా క్రిమినల్ కేసులు, బెయిల్ పొంది షరా మామూలుగా అక్రమ రవాణా చేస్తున్నారు. రెవెన్యూ, పోలీస్, విజిలెన్స్ శాఖలు సమన్వయంతో పనిచేసి తరచూ స్మగ్లర్ల గోడౌన్‌లపై దాడులు చేసి బియ్యాన్ని సీజ్ చేస్తే తప్ప ఈ స్మగ్లింగ్‌కు అడ్డుకట్ట వేయడం సాధ్యం కాదు. ఈ దిశగా జిల్లా స్థాయిలో కలెక్టర్, ఎస్పీ జోక్యం చేసుకుంటేనే గాని అక్రమ వ్యాపారానికి ఫుల్‌స్టాప్ పడదు.

ప్రజలతో సంబంధాలు

కొనసాగించండి

అనంతపురం రేంజ్ డిఐజి రవిప్రకాష్

పెనుమూరు, అక్టోబర్ 20 ప్రభాతవార్త:
పోలీసులు ప్రజలతో సత్‌సంబంధాలు కొనసాగించి వారి మాన, ప్రాణ రక్షణకు బాధ్యులుగా వుండాలని, స్టేషన్‌కు వచ్చే పలు కేసులను సత్వరం పరిష్కరించి వివాదాలకు తావు లేకుండా చూడాలని అనంతపురం రేంజ్ డిఐజి రవిప్రకాష్ పేర్కొన్నారు. గురువారం ఆయన పెనుమూరు పోలీస్ స్టేషన్‌ను అకస్మికంగా తనిఖీ చేసి పలు రికార్డులను పరిశీలించి పోలీసు అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఇక్కడ పలు గ్రామాల్లో నాటు సారా తయారీపై ఉక్కుపాదం మోపడం జరిగిందని ఫలితంగా నాటు సారా రహిత గ్రామాలుగా తీర్చిదిద్దడం జరిగిందన్నారు. నాటు సారా తయారీదారుల జీవనోపాధికై పలు మార్గాలను సూచించడం జరిగిందన్నారు. అలాగే ఎర్రచందనం స్మగ్లర్లపై కఠిన చర్యల నిమిత్తం వారి వేలి ముద్రలను ఆన్‌లైన్‌లో పొందుపరచి పక్కాగా వారికి శిక్ష పడేలా చర్యలు తీసుకొంటున్నామన్నారు. అలాగే పోలీస్ స్టేషన్లలో బాధితులు ఫిర్యాదులు చేస్తే గంట వ్యవధిలో కేసు నమోదు చేసి పదిహేను రోజుల్లో రిజిస్ట్రేషన్ చేయాలన్నారు. బయటి కేసులు వుంటే వెంటనే జిఓ ఎఫ్ఐఆర్ కట్టి ఆయా పోలీస్ స్టేషన్లకు పంపాలన్నారు. నేరాలు జరిగిన చోటే పోలీసులు ఎక్కువగా గస్తీ నిర్వహించాలన్నారు. తప్పుడు సోషియల్ మీడియాలో వచ్చే వార్తలను ప్రజలను నమ్మవద్దని సూచించారు. ప్రధాన మీడియాల్లో వచ్చే వార్తలను మాత్రమే ప్రజలు పరిగణనలోకి తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎఎస్పీ జగదీష్, ఇన్స్‌పెక్టర్ మద్దయ్యాచ్చారి, పెనుమూరు ఎస్ఐ అనిల్‌కుమార్, ఎన్ఆర్ పేట ఎస్ఐ ప్రతాప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భాష..సంస్కృతి..సాహిత్యాలను మరువరాదు

ద్రవిడ వర్సిటీ వి.సి. ఆచార్య రామకృష్ణ

ద్రవిడ వర్సిటీలో స్టడీ పార్కును ప్రారంభిస్తున్న విసి ఆచార్య రామకృష్ణ, రిజిస్ట్రార్ డా॥ వేణుగోపాల్‌రెడ్డి

కుప్పం, అక్టోబర్ 20 ప్రభాతవార్త
భాష, సంస్కృతి, సాహిత్యాలను ఎన్నటికీ మరువరాదని ద్రవిడ వర్సిటీ వి.సి. ఆచార్య తుమ్మల రామకృష్ణ పేర్కొన్నారు. గురువారం ద్రవిడ వర్సిటీ రజతోత్సవాల్లో భాగంగా ఎంఎస్ సుబ్బలక్ష్మి ఆడిటోరియంలో నాలుగు రాష్ట్రాలకు సంబంధించి ద్రావిడ సాహిత్యం మరియు సంస్కృతులపై ప్రత్యేక ఉపన్యాస కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విసి మాట్లాడుతూ తెలుగు 11వ శతాబ్దంలో వచ్చిందని అనుకుంటారని అయితే ఐదారు శతాబ్దం నుంచే బెజవాడ, అద్దంకి శాసనాలు పరిశీలిస్తే అర్థమవుతుందన్నారు. అనంతరం ఇతర ద్రవిడ భాషలు రావడం, సాహిత్య సృజన జరగడం, జ్ఞానాన్ని ఓతరం నుంచి ఇంకో తరంకు అందించడం జరిగిందన్నారు. కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత రాచపాళెం చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ మార్క్సిస్ట్ దృక్కోణం నుంచి తెలుగు సాహిత్యాన్ని విస్తృతంగా వివరించారు. తమిళ సంస్కృతిపై మాట్లాడిన తమిళనాడు ప్రభుత్వ పాఠశాలల విద్యాశాఖ జెడి డా॥ పొన్నుకుమార్ ప్రపంచ ద్రావిడ సంస్కృతుల మధ్య సంబంధాన్ని వివరించారు. కేరళ రాష్ట్ర ఉత్తమ గీత రచయిత ఉన్ని కృష్ణన్ మాట్లాడుతూ పంబ నది ప్రవాహనంలోని లయ, పాడైనిలో సంగీతం, నృత్యాలకు ఉన్న ఆధ్యాత్మిక సమ్మేళనం ప్రేరణ కలిగిస్తాయన్నారు. అనంతరం ఉపన్యాసకులను రిజిస్ట్రార్ డా॥ వేణుగోపాల్‌రెడ్డి, రెక్టార్ ఆచార్య అనురాధ సత్కరించారు. ఈ సందర్భంగా వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ విసి ఆచార్య కంకణాల రత్నయ్య, మాజీ రిజిస్ట్రార్లు ఆచార్య రాజశేఖర్‌రెడ్డి, వరదరాజులు నాయుడు, హేమాక్షి ఆచారి, తిరుపతి రావు, సుశీల, మాధవనాయుడు పాల్గొన్నారు. అనంతరం వర్సిటీ ప్రాంగణంలో సిల్వర్ జూబ్లీ స్టడీ పార్కును ప్రారంభించారు.

పట్టభద్రులు, ఉపాధ్యాయులు

ఓటు నమోదు చేసుకోండి

తిరుపతి జిల్లా కలెక్టర్ వెంకటరమణారెడ్డి

తిరుపతిరూరల్, అక్టోబర్20 ప్రభాతవార్త:
పట్టభద్రుల, ఉపాధ్యాయ నియోజకవర్గం ఓటరు నమోదు అక్టోబర్ 01 నుండి ప్రారంభమైందని, పట్టభద్రులు, ఉపాధ్యాయులు ఓటు హక్కుకు నమోదు చేసుకోవాలని తిరుపతి జిల్లా కలెక్టర్ వెంకటరమణారెడ్డి పేర్కొన్నారు. పట్టభద్రులు ఫారమ్-18ను, ఉపాధ్యాయులు ఫారమ్-19ను పూర్తి చేసిన ధరఖాస్తులకు నివాస అడ్రస్ ఆధారంగా ప్రభుత్వం నిర్దేశించిన మండల కార్యాలయాల్లో, రెవెన్యూ డివిజన్ కార్యాలయాలు, అసిస్టెంట్ ఎలక్షన్ రిటర్నింగ్ ఆఫీసర్స్ (కలెక్టరేట్) కార్యాలయాల్లో నవంబర్ 7వ తేదీ లోపు అందజేయాలన్నారు. 2019 అక్టోబర్ 31 నాటికి డిగ్రీ పాసైన పట్టభద్రులు ఓటరు నమోదుకు అర్హులని తెలిపారు. పట్టభద్రులు డిగ్రీ సర్టిఫికేట్స్ జిరాక్స్ కాపీ జత చేసి, దానిపై గజిటెడ్ ఆఫీసర్‌చే అటెస్ట్ చేయించాలన్నారు. ఉపాధ్యాయులు 2016 నవంబర్ 1 నుండి 2022 అక్టోబర్ 31 వరకు గల 6 సంవత్సరాల కాలంలో 3సంవత్సరాల కాలం పనిచేసిన హై స్కూల్, కాలేజీలు, యూనివర్శిటీలలో పని చేస్తున్న అధ్యాపకులు, ఉపాధ్యాయులు అందరూ టీచర్ ఓటరు నమోదుకు అర్హులని తెలిపారు. ఫారమ్-19 ధరఖాస్తులో సర్వీస్ సర్టిఫికేట్‌ను సంబంధిత హెడ్మాస్టర్, ప్రిన్సిపల్‌తో ధృవీకరణ చేయించి సమర్పించాలన్నారు. నివాస ధృవీకరణకు ఓటరు కార్డు, ఆథార్‌కార్డు, రేషన్‌కార్డు కాఫీ ఇవ్వాలన్నారు.

నాడు-నేడు పనులు వేగవంతం

- వీడియో కాన్ఫరెన్స్‌లో జాయింట్ కలెక్టర్ వెంకటేశ్వర్

చిత్తూరు, అక్టోబర్ 20 ప్రభాతవార్త:
జిల్లాలో నాడు-నేడు పనులు వేగవంతంగా చేపడుతున్నామని జాయింట్ కలెక్టర్ వెంకటేశ్వర్ రాష్ట్ర అధికారులకు వివరించారు. పాఠశాలల్లో జరుగుతున్న నాడు-నేడు పనులపై గురువారం ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి రాజశేఖర్, స్కూల్ ఎడ్యుకేషన్ కమీషనర్ సురేష్, స్కూల్ ఇన్‌ఫ్రా కమీషనర్ భాస్కర్, సలహాదారుల మురళీలు కలెక్టర్లు, సర్వశిక్షాభియాన్ అధికారులు, డిఇఓలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లా నుండి ఈ వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరైన జాయింట్ కలెక్టర్ వెంకటేశ్వర్ మాట్లాడుతూ జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో నాడు-నేడు పనులను పూర్తి స్థాయిలో వేగవంతం చేస్తున్నామన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధికారులు నాడు-నేడు కార్యక్రమంలో పాఠశాలల్లో చేపడుతున్న అదనపు తరగతి గదుల నిర్మాణాలు, మరుగుదొడ్లు, ప్రహరీగోడల నిర్మాణాలు, విద్యుద్దీకరణ, మంచినీటి సరఫరా, మైనర్ వర్క్‌లకు సంబంధించి పూర్తి స్థాయిలో అధికారులతో సమీక్షించారు.

ఎనిమిదేళ్లలో ఇది 5వ జీఎస్ఎల్‌వీ మార్క్3 ప్రయోగం

నలుగురు ఇస్రో ఛైర్మన్ల ఆధ్వర్యాన భారీ ప్రయోగాలు

శ్రీహరికోట (తడ), అక్టోబర్ 20 ప్రభాతవార్త
శ్రీహరికోట నుంచి పీఎస్ఎల్‌వీ రాకెట్లను ఎప్పటికప్పుడు ఎక్కువ సంఖ్యలో ప్రయోగిస్తున్న శాస్త్రవేత్తలు జీఎస్ఎల్‌వీ తరహా రాకెట్లను అడపదడపా మాత్రమే ప్రయోగిస్తున్నారు. ఈ రాకెట్ నిర్మాణంలో సాంకేతిక అభివృద్ధిని రూపొందించుకోవడానికి చాలా సమయమే పట్టింది. ముఖ్యంగా క్రయోజనిక్ ఇంధనం కోసం అగ్రరాజ్యాలు ఆంక్షలు విధించాయి. మొదట జీఎస్ఎల్‌వీ ఎంకే2 రాకెట్లను అభివృద్ధి చేసుకున్న ఇస్రో అనంతరం జీఎస్ ఎల్‌వీ మార్క్3 రాకెట్లను తయారు చేసింది. జీఎస్ఎల్‌వీ రాకెట్లు ఆశించిన ఫలితాన్ని ఇవ్వలేదు. జీఎస్ఎల్‌వీ మార్క్3 రాకెట్లు మాత్రం మంచి ఫలితాలనే ఇచ్చాయి. ఈ అతిపెద్ద రాకెట్లను ఇప్పటికి నాలుగు ప్రయోగించగా, ఏ ఒక్కటీ నిరాశపరచలేదు. 2014 డిసెంబర్ 18న జీఎస్ఎల్‌వీ మార్క్3 రాకెట్‌ను శ్రీహరికోట నుంచి తొలిసారి ప్రయోగించారు. అయితే అందులో ఎటువంటి ఉపగ్రహాన్ని పంపించలేదు. పరిశీలన ప్రధాన లక్ష్యంగా క్రూ మాడ్యూల్ అనే పరికరాన్ని ఈ రాకెట్‌లో ఉంచి అంతరిక్షానికి చేరవేశారు. అనంతరం దాన్ని తిరిగి క్షేమంగా సముద్రంలోకి, అక్కడి నుంచి భూమార్గానికి చేరవేశారు. అప్పటి ఇస్రో ఛైర్మన్ డాక్టర్ కె.రాధాకృష్ణన్. రెండోసారి జీఎస్ఎల్‌వీ మార్క్3 ఉపగ్రహాన్ని ప్రయోగించడానికి మూడేళ్ల సమయం పట్టింది. 2017 జూన్ 5న జీశాట్-19 ఉపగ్రహాన్ని జీఎస్ఎల్‌వీ మార్క్3 రాకెట్ ద్వారా విజయవంతంగా ప్రయోగించారు. ఈ ఉపగ్రహం బరువు ఏకంగా 3136 కిలోలుగా ఉంది. అతిపెద్ద ఉపగ్రహాలను అలవోకగా అంతరిక్షంలోకి పంపే సామర్థ్యంతో పాటు అమెరికా, రష్యా, చైనాలకు ధీటుగా మానవ సహిత ఉపగ్రహాన్ని మనం కూడా ప్రయోగించవచ్చని అప్పుడే సగర్వంగా ప్రకటించారు. అప్పటి ఇస్రో ఛైర్మన్ ఎఎస్ కిరణ్‌కుమార్. మూడవ జీఎస్ఎల్‌వీ మార్క్3 రాకెట్‌ను 2018 నవంబర్ 14న శ్రీహరికోట నుంచి విజయవంతంగా ప్రయోగించారు. 3423 కిలోల బరువు ఉన్న జీశాట్-29 ఉపగ్రహాన్ని ఈ రాకెట్ అంతరిక్షంలోకి క్షేమంగా చేర్చింది. సమాచార విప్లవం కోసం దీన్ని ప్రయోగించారు. అప్పటి ఇస్రో ఛైర్మన్ కె.శివన్. శివన్ ఆధ్వర్యంలోనే చంద్రయాన్-2 ఉపగ్రహాన్ని జీఎస్ఎల్‌వీ మార్క్3 రాకెట్ ద్వారా అంతరిక్షంలోకి చేర్చడానికి ఇస్రో శ్రమించింది. 2019 జూలై 14న అర్ధరాత్రి జరగాల్సిన ఈ ప్రయోగం చివరి క్షణాల్లో గ్యాస్ లీక్ వల్ల నిలిచిపోయింది. దీనితో మళ్లీ శాస్త్రవేత్తలు మొక్కవోని దీక్షతో కష్టపడి అదే ఏడాది జూలై 22న జాబిల్లిపైకి మన చంద్రయాన్-2ను ప్రయోగించారు. సెప్టెంబర్ 7న ఈ ఉపగ్రహంలోని విక్రమ్ ల్యాండర్ చంద్రునిపై క్షేమంగా దిగడంలో తడబాటుపడింది. అయితే మన జీఎస్ఎల్‌వీ మార్క్3 ప్రయోగం మాత్రం విజయవంతంగా ముగిసింది. విక్రమ్ ల్యాండర్ జాడ తెలియకపోయినా అందులోని రోవర్, ఆర్బిటర్‌లు చంద్రుని గురించిన ఎన్నో పరిశోధనలను ఇస్రో శాస్త్రవేత్తలకు అందించింది. ప్రస్తుతం జీఎస్ఎల్‌వీ 5వ ప్రయోగం ఇస్రో ఛైర్మన్ ఎస్.సోమనాథ్ ఆధ్వర్యంలో జరుపుతున్నారు. ఈ రాకెట్ ద్వారా 5400 కిలోల బరువు ఉన్న 36 కమర్షియల్ ఉపగ్రహాలను ప్రయోగిస్తున్నారు.

కల్యాణ వెంకన్న పవిత్రోత్సవాలకు

అంకురార్పణ

చంద్రగిరి, అక్టోబర్ 20 ప్రభాతవార్త:
శ్రీనివాస మంగాపురంలో వెలసియున్న శ్రీకల్యాణ వెంకటేశ్వర స్వామి వారి ఆలయంలో గురువారం ఆలయ అర్చకులు పవిత్రోత్సవాలకు అంకురార్పణ గావించారు. ఇందులో భాగంగా వేకువజామున స్వామి వారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి తోమాల అర్చనాది నిత్యకైంకర్యాలను ఆగమోక్తంగా నిర్వహించారు. రాత్రి 7 గంటలకు ఆలయ ప్రధాన అర్చకులు, కంకణదారులు బాలాజీ రంగాచార్యులు ఆధ్వర్యంలో అర్చకులు మృత్సంగ్రహణం, సేనాధిపతి ఉత్సవం, అంకురార్పణ ఆగమోక్తంగా జరిపించారు. ఈ సందర్భంగా ఆయన ఉత్సవాల విశిష్టతను వివరిస్తూ స్వామి వారికి ఆలయంలో నిర్వహించే నిత్య, వార, మాస, వార్షిక పూజాధి, సేవలు, ఉత్సవాలలో తెలిసీ తెలియక చోటుచేసుకునే దోషాల నివృత్తికై పవిత్రోత్సవాలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తున్నట్లు తెలిపారు. ఈ పవిత్రోత్సవాలలో ఆలయశుద్ధి, పుణ్యావచనం, పవిత్రష్ట ప్రతిష్ట గావించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంల స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ ఈఓ వరలక్ష్మి, ఆలయ సూపరింటెండెంట్ రమణయ్య, టోంపుల్ ఇన్‌స్పెక్టర్ కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

ఉష్ణోగ్రతలు
20/10/2022

- తిరుపతి 30 డిగ్రీలు
- చిత్తూరు 31 డిగ్రీలు
- మదనపల్లి 25 డిగ్రీలు
- శ్రీకాళహస్తి 31 డిగ్రీలు
- వెంకటగిరి 32 డిగ్రీలు
- గూడూరు 33 డిగ్రీలు

బంగారం ధరలు
20/10/2022

22 క్యారెట్స్ 1గ్రాము రూ. 4,685
24క్యారెట్స్ 1గ్రాము రూ.5,111

కోడిగ్రుడ్ల ధరలు
20/10/2022

కోడిగ్రుడ్డు :రూ.6.00
1 డజను: రూ.72.00

ప్రజా సమస్యల పరిష్కారానికే గడప గడపకు మన ప్రభుత్వం

-పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్.బాబు

ఐరాల, అక్టోబర్ 20 ప్రభాతవార్త:

ప్రజా సమస్యల పరిష్కారానికే గడప గడపకు మన ప్రభుత్వం లక్ష్య మని పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్.బాబు అన్నారు. గురువారం మండలంలోని పుత్రమద్ది గ్రామ సచివాలయ పరిధిలోని కుళ్ళంపల్లె, పరశురెడ్డిపల్లె, గురువణంపల్లె, మిట్టూరు, మిట్టూరు బీసీ కాలనీ తదితర గ్రామాలలో మండల స్థాయి అధికారులు, ప్రజా ప్రతినిధుల తో కలసి గడప గడపకు- మన ప్రభుత్వం కార్యక్రమంను నిర వ్హిం చారు. ఈసందర భ్రంగా ఎమ్మెల్యే ఆయా

గ్రామాలలో ప్రతి ఇంటికి వెళ్ళి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల గురించి అడిగి తెలుసు కున్నారు. ఈకార్యక్రమంలో ఎంపీపీ చింతం మోహన్, ఎంపీడీఓ నిర్మలాదేవి,తహశీల్దార్ సుశీల, మండల వైకాపా కన్వీనర్ బుజ్జిరెడ్డి, వైస్ ఎంపీపీ నిత్య, నాయకులు చలపతిరెడ్డి, పూజారి మోహన్‌రెడ్డి, సురేష్‌రెడ్డి, శాంతిసాగర్‌రెడ్డిలతో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు

ఏరియా ఆస్పత్రి చిల్డ్రన్ స్పెషలిస్టుగా డా॥ అనిల్‌రామ్ బాధ్యతలు

కుప్పం, అక్టోబర్ 20 ప్రభాతవార్త

కుప్పం ఏరియా ఆస్పత్రిచిన్న పిల్లల వైద్య నిపుణులుగా డా॥ అనిల్‌రామ్ గురువారం బాధ్యతలు చేపట్టా రు. కుప్పంకు చెందిన డా॥ అనిల్‌రామ్ తిరుపతి ఎస్వీ మెడికల్ కాలేజ్‌లోఎంబిబిఎస్,డిసిహెచ్‌పూర్తిచేశారు.అనంతరంకర్నూలు రెయిన్‌బో హాస్పిటల్, చెన్నై మెహతాచిల్డ్రన్స్ హాస్పిటల్,నెల్లూరుకిమ్స్ ఆస్పత్రిలోచిన్నపిల్లలవైద్య నిపుణులుగా ఎనిమిదేళ్లు పనిచేశారు. ప్రస్తుతం కుప్పం ఏరియా ఆస్పత్రిలో బాధ్యతలు చేపట్టారు.

కుప్పం ఇంజనీరింగ్ కాలేజ్‌లో జెఎన్‌టియు ఫుట్‌బాల్ జట్టు సెలక్షన్స్

కుప్పం, అక్టోబర్ 20 ప్రభాతవార్త

కుప్పం ఇంజనీరింగ్ కాలేజ్‌లో అనంతపురం జెఎన్‌టియుకు సంబం ధించిన ఫుట్ బాల్ జట్టు సెలక్షన్స్‌ను గురువారం జెఎన్‌టియుఎ స్పోర్ట్ కౌన్సిల్ కార్యదర్శి జోజిరెడ్డి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు విద్యతో పాటు క్రీడలు అవసరమన్నారు. కుప్పం ఇంజనీరింగ్ కాలేజ్‌లో యూనివర్సిటీ స్థాయి సౌకర్యాలు ఉండడంతో ఇక్కడ సెలక్షన్స్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కాలేజ్ వైస్ ఛైర్మన్ డా॥ సునీల్ రాజ్ మాట్లాడుతూ విద్యార్థుల మానసిక వికాసంకు క్రీడలు దోహదపడతాయన్నారు. కాగా 197 కళాశాలలకు చెందిన 200మంది ఈ సెలక్షన్స్‌లో పాల్గొనగా 22మందితో జట్టును ఎంపిక చేశారు. జట్టులో కెఇసికి చెందిన ముగ్గురు మంది విద్యార్థులు ఎంపికయ్యారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డా॥ సుధాకర్‌బాబు, వైస్ ప్రిన్సిపాల్ డా॥ భాస్కరన్, ఆర్‌అండ్‌డి డైరెక్టర్ డా॥ కోదండరామయ్య, పిడి సతీష్‌కుమార్, హెచ్‌ఒడిలు పాల్గొన్నారు.

రైతులకు రాయితీ డ్రిప్ పరికరాలు పంపిణీ

కుప్పంరూరల్, అక్టోబర్ 20 ప్రభాతవార్త

మండలంలోని ములకలపల్లిలో ఉద్యానవన శాఖచే రైతులకు రాయితీతో బిందుసేద్య పరికరాలను ఉద్యానవన అధికారి డింపు ప్రియ పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ డ్రిప్, స్ప్రింక్లర్ పరికరాలు రైతులకు రాయితీతో అందిస్తున్నట్లు తెలిపారు. పరికరాలు అవసరమైన రైతులు తమ పరిధిలో ఉన్న రైతు భరోసా కేంద్రాల్లో పాసు పుస్తకం, ఆధార్‌కార్డు, బోరు సర్వేసు, ఫోన్ నెంబరు తదితర వివరాలు అందించి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని కోరారు.

వైకాపా సోషియల్ మీడియా విభాగం నియామకం

కుప్పంరూరల్, అక్టోబర్ 20 ప్రభాతవార్త

కుప్పం నియోజకవర్గ వైకాపా సోషియల్ మీడియా విభాగంను జిల్లా కన్వీనర్ నవీన్‌కుమార్ రాజు నియమించారు. కుప్పం నియోజకవర్గ కన్వీనర్లుగా ప్రశాంత్, మురుగేష్, కో కన్వీనర్లుగా ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, మహేష్ నాని, సాధిక్, గణపతిలను నియమించారు. ఈ సందర్భంగా వారు తమపై నమ్మకంతో ఈ పదవుల్లో నియమించిన పార్టీ పెద్దలకు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ బలోపేతంకు

శ్రీతిరుపతి గంగమ్మ ఆలయ పునర్నిర్మాణ పనులు మొదలు

కుప్పం, అక్టోబర్ 20 ప్రభాతవార్త

జిల్లాలో ప్రసిద్ధి చెందిన కుప్పం గ్రామదేవత శ్రీ తిరుపతి గంగమాంబ అమ్మవారి ఆలయ పునర్ని ర్మాణంకు సంబంధించి పనులను గురువారం ప్రారంభించారు. జెసిబి యంత్రం సాయంతో ప్రహరీగోడను కూల్చారు. గతంలో ఆలయ అభివృద్ధి కోసం రాష్ట్ర గనులు, అటవీ, విద్యుత్ శాఖ మంత్రి డా॥ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆదేశాలతో దాదాపు 2.50 కోట్ల రూపాయల నిధులు మంజూరయ్యాయి. ఇటీవలే చిత్తూరు ఎమ్మెల్సీ, జిల్లా వైకాపా అధ్యక్షుడు కెఆర్‌జె భరత్, టిటిడి ఇంజనీరింగ్, దేవదాయ శాఖ అధికారులతో కలసి ఆలయ పునర్నిర్మాణ పనుల మాస్టర్ ప్లాన్‌ను ఖరారు చేశారు. గత రెండు రోజులుగా అమ్మవారి ఆలయంలో బాలాలయ కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ఆలయ పునర్నిర్మాణ పనులు ప్రారంభించారు. రానున్న జాతరలోగా అమ్మవారి ఆలయంను ఆధునీకరించనున్నట్లు తెలిసింది.

ఎమ్మెల్సీ ఓటర్ నమోదు ప్రక్రియను వేగవంతం చేయండి

వెదురుకుప్పం, అక్టోబర్ 20 ప్రభాతవార్త :

ప్రకాశం, నెల్లూరు, చిత్తూరు, జిల్లాల తూర్పు రాయలసీమ పట్టభద్రుల శాసన మండలి ఎన్నికల కొరకు జరుగుతున్న ఓటర్ ప్రక్రియ వేగవంతం చేయాలని టిడీపీ జిల్లా మాజీ కార్యదర్శి మోహన్ మురళి పేర్కొన్నారు. చిత్తూరు జిల్లా గంగాధర నెల్లూరు నియోజకవర్గం పరిధిలోని వెదురుకుప్పం మండలంలో గురువారం నల్లవెంగనపల్లె, పాతగుంట, కురివికుప్పం, బ్రాహ్మణపల్లె, గంటావారిపల్లె, పెరుమాళ్ళపల్లె, మారేపల్లె గ్రామ పంచాయితీలలో పట్టభద్రుల నియోజకవర్గ ఓటర్ల జాబితాలో పేర్ల నమోదు కొరకు ఫారం 18ని మాడల్ కాఫీ పంపిణీ చేసి అవగాహన కల్పించారు. తెలుగు దేశం పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థిగా డాక్టర్ కంచర్ల శ్రీకాంత్ గెలుపుకు కార్యకర్తలు, నాయకులు కృషి చేయాలని చూచించారు.ఈ కార్యక్రమంలో యూనిట్ ఇన్‌చార్జీలు బట్టే చాణిక్య ప్రతాప్, రాజా రెడ్డి, శ్రీరాములు రెడ్డి, బూత్ కమిటీ కన్వనర్‌లు వరప్రసాద్ కుమార్, యుగంధర్ రెడ్డి, చంద్రబాబు రెడ్డి, షణ్ముగం రెడ్డి, భాస్కర్ రెడ్డి, మునికృష్ణా రెడ్డి, సుధాకర్ నాయుడు, బాలాజీ నాయుడు, చిట్టెమ్మ, మునికృష్ణా రెడ్డి, నాథముని రెడ్డి, విజయకుమార్, చంద్రశేఖర్, వినోద్, భాను, అనిల్, సాల్మన్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత శిక్షణ ఉద్యోగం కొరకు నేడు అవగాహన కార్యక్రమం

వెదురుకుప్పం, అక్టోబర్ 20 ప్రభాతవార్త :

నిరుద్యోగ యువతి యువకులకు ఉచిత శిక్షణ ఉద్యోగ అవకాశాల కల్పన పై శుక్రవారం ఉయదం వెలుగు కార్యాలయంలో అవగాహన కార్యక్రమం జరుగుతుందని వెలుగు ఎపియం కవిత తెలిపారు.మండల కేంద్రంలోని వెలుగు కార్యాలయంలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు అవగాహన ఎంపిక కార్యక్రమం జరుగుతుందన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉద్యోగ కల్పన మరియు వ్యవస్థ అభివృద్ధి సంస్థ విఆర్‌డిఏ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించడం జరుగుతుందన్నారు. వివరాలకు జెఆర్‌పి క్రిష్ణయ్య 9701387293 సెల్ నంబర్ సంప్రదించాలన్నారు.

మెరుగైన అభ్యసన సామర్థ్యం ఉపాధ్యాయ వృత్తికి నిదర్శనం

ఐరాల, అక్టోబర్ 20 ప్రభాతవార్త:

మెరుగైన అభ్యసన సామర్థ్యం ఉపాధ్యాయ వృత్తికి నిదర్శనమని ఎంఈఓ వేణుగోపాల్‌రెడ్డి అన్నారు. స్థానిక ఎంఈఓ కార్యాలయంలో ఈనెల 17 నుండి జరుగుతున్న నాలుగు టీచింగ్ అట్ ద రైట్ లెవల్ మొదటి దశ శిక్షణా కార్యక్రమం గురువారం ముగిసింది. ఈసందర్భంగా రీసోర్స్ పర్సన్‌లు రమాదేవి, కుమారస్వామినాయుడులు పట్టిక ద్వారా సులభపద్ధతిలో స్నాప్, క్లాప్ ద్వారా స్థాన విలువలు ఎలా చెప్పాలి, ఎక్కాలను వల్లె వేయడం కాకుండా కృత్యాధార పద్ధతిలో సులభంగా ఎలా నేర్పాలి అనే విషయాలపై ఉపాధ్యాయులకు శిక్షణ నిచ్చారు. ఎంఈఓ వేణుగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ బడిలోని చివరి బెంచ్ విద్యార్థికి అర్థం అయ్యేలా బోధించాలని, మెరుగైన ఫలితాలు వస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఆర్పీలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కుప్పం మున్సిపల్ అభివృద్ధికి సహకరించాలి

- మున్సిపల్ ఛైర్మన్ డా॥ సుధీర్

కుప్పం, అక్టోబర్ 20 ప్రభాతవార్త

కుప్పం మున్సిపల్ అభివృద్ధికి సహకరించాలని మున్సిపల్ ఛైర్మన్ డా॥ సుధీర్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ రీజనల్ డివిజన్ ఆఫీసర్ మూర్తిను కోరారు. గురువారం రీజనల్ ఆఫీసరు కుప్పం మున్సిపల్ కార్యాలయంలో కమీషనర్ రవిరెడ్డి, వార్డు సచివాలయ సిబ్బంది, మున్సిపల్ సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా ఛైర్మన్ మాట్లాడు తూ మున్సిపాలిటీలో నీటి పన్ను, ట్రేడింగ్ లైసెన్సులను ఆన్‌లైన్ చేయాలని కోరారు. అనంతరం ఆర్డీఒమూర్తిమాట్లాడుతూ సచివాలయ సిబ్బంది విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే తగు చర్యలు తీసుకుంటామనిహెచ్చరించారు.అనంతరంవివిధ అంశాలపై ఛైర్మన్ డా॥ సుధీర్, కమీషనర్‌తో చర్చించారు.

తాగునీటి బిల్లులు చెల్లింపుకై వినతి

శాంతిపురం, అక్టోబర్ 20 ప్రభాతవార్త

గ్రామాల్లో ట్రాక్టర్ల ద్వారా సరఫరా చేసిన తాగునీటి బిల్లులు మంజూరు చేయాలని నీటి సరఫరాదారులు గురువారం మండల అధికారులకు వినతిపత్రం అందించారు. అలాగే విషయంను చిత్తూరు ఎమ్మెల్సీ భరత్ దృష్టికి సైతం తీసుకెళ్లారు.దీనిపై ఆయన స్పందించి విషయంను మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని వారు తెలిపారు.

చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

దాతల సహకారంతో కళాశాల అభివృద్ధి

- బిఎస్ కన్నన్ కళాశాల ప్రిన్సిపాల్

చిత్తూరురూరల్, అక్టోబర్ 20 ప్రభాతవార్త:

ప్రభుత్వ ఆదేశాలనుసారం బిఎస్ కన్నన్ కళాశాలను అన్ని విదాలా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ సయ్యద్ మౌలా తెలిపారు. గురువారం స్థానిక కళాశాలఆవరణలోచేపడుతున్నఅభివృద్ధికార్యక్రమాలపై ఆయన విలేకరులతో మాట్లాడుతూ పేద ప్రజలు సైతం విద్యను అభ్యసించి ఉన్నత శిఖరాలకు ఎదగాలనే మక్కువతో బిఎన్ కన్నన్ తల్లి దండ్రులు వందల కోట్లు విలువచేసే తమ ఆస్తులను ఉచితంగా ప్రభుత్వానికి అందించారని, వారి ఆశ యాలకనుగుణంగా ప్రభుత్వ ఆదేశాలనుసారం తమ వంతు కళాశాల అభివృద్ధికి కృషి చేస్తున్నా మని పేర్కొన్నారు.రానున్న ఏడాది కళాశాలను జిల్లా, రాష్ట్రస్థాయిలో మెరుగైన స్థానంలో నిలిపేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు.

వైభవంగా ఆయుధ పూజ

చిత్తూరురూరల్, అక్టోబరు 20 ప్రభాతవార్త:

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ వాహన డ్రైవర్ల సంఘ భవనంలో బుధవారం రాత్రి ఆయుధ పూజను ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా డిఆర్‌డిఏ పిడి తులసి పాల్గొని పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం భవనంలో పనిచేస్తున్న కార్మికులకు, వాహన డ్రైవర్లకు ముందస్తు దీపావళి శుభాకాంక్షలు తెలు పుతూ కొత్త బట్టలు, స్వీట్స్ అందజేసారు. జిల్లా అధ్యక్షుడు పన్నీర్ సెల్వం, గౌరవ అధ్యక్షుడు షణ్ముగం, ముఖ్యసలహాదారుడురామన్న,ఉపాధ్యక్షుడు హరి, జనరల్ సెక్రటరీ రోషన్‌భాష, అన్నామలై, పాల్‌రాజ్, గంగాధరం,డిసిసిబ్యాంక్‌గురునాథం, అన్నాదొరై, సురేష్‌బాబులతో పాటు పలువురు డ్రైవర్లు పాల్గొన్నారు.

తిరువన్నామలైకు ప్రత్యేక బస్సులు

- నేటి నుంచి రిజర్వేషన్ సౌకర్యం - చిత్తూరు-1 డిపో మేనేజర్ ఎం. క్రిష్ణమూర్తి

చిత్తూరురూరల్, అక్టోబరు 20 ప్రభాతవార్త:

ప్రయాణీల సౌకర్యార్థం నవంబర్ 7వ తేది కార్తీక పౌర్ణమిని పురస్కరించుకొని కాణిపాకం నుంచి తిరువ న్నామలైకు ప్రత్యేక బస్సులను నడుపుతున్నట్లు చిత్తూరు-1 డిపో మేనేజర్ ఎం. క్రిష్ణమూర్తి తెలిపారు. కాణిపాకం నుంచి మధ్యాహ్నం 2గంటలకు బస్సు బయలుదేరి చిత్తూరుకు చేరుకొని, చిత్తూరు నుంచి 2.45కు బయలుదేరి తిరువన్నామలైకు సాయంత్రం 6గంటలకు చేరుకొంటుందన్నారు. అక్కడ నుంచి 2గంటలకు బయలుదేరి ఉదయం 6గంటలకు కాణిపాకం చేరుకొంటుందని పేర్కొన్నారు. కాగా కాణిపాకం- తిరువన్నామలై(పెద్దలకు రూ.300, పిల్లలకు రూ. 170), చిత్తూరు- తిరువన్నామలై(పెద్దల కు రూ.270, పిల్లలకు రూ. 160) రానుపోను ఛార్జీలు వసూలు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

కార్డుదారులకు సక్రమంగా రేషన్ పంపిణీ

పాలసముద్రం, అక్టోబర్ 20 ప్రభాతవార్త:

ప్రతినెలా రేషన్‌కార్డుదారులకు సక్రమంగా రేషన్ పంపిణీ చేయాలని తహసిల్దారు బాబు డీలర్లను ఆదేశించారు. పాలసముద్రం తహసిల్దారు కార్యాలయంలో గురువారం తహసిల్దారు బాబు రేషన్‌షాపు డీలర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ కార్డుదారులు ఎవరికైనా రేషన్ తగ్గితే డీలర్లు పూర్తి బాధ్యత వహించాలన్నారు. సమావేశంలో డిప్యుటీ తహసిల్దారు మధుబాబు, ఆర్ఐ కిషోర్, గ్రామ సచివాలయ విఆర్‌ఓలు పాల్గొన్నారు.

వైకాపా నాయకుడి మృతికి సంతాపం

సదుం, అక్టోబరు 20 ప్రభాతవార్త

మండల పరిదిలోని బూరగమంద పంచాయతీకి గాదేవారిపల్లెకు చెంది న వైకాపా నాయకుడు చుక్కా కృష్ణయ్య(51) గురువారం ఉదయం అస్వస్థతకు గురయ్యారు. కుటుంబ సభ్యులు ఆయనను ఆసుపత్రికి తరలించే లోపే మృతి చెందాడు. ఈవిషయం తెలుసుకున్న తంబళ్లపల్లె శాసనసభ్యులు పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి, రాష్ట్ర వైసీపీ కార్యదర్శి పెద్దిరె డ్డిలువెళ్లిఆయనకుటుంబీకులనుపరామర్శించి సంతాపం వెలిబు చ్చారు. వారి వెంట బూరగమంద మాజీ సర్పంచి వెంకటరెడ్డి, ఎంపీటీసీ మల్లికార్జున,సర్పంచి వెంకటరమణ, సింగిల్‌విండోఉపాధ్యక్షుడురమేష్‌రెడ్డి,మండల పరిషత్ కోఆప్షన్‌మెంబర్ ఇమ్రాన్ తదితురులు పాల్గొన్నారు

140వరోజుకు చేరిన తెదేపా అన్న క్యాంటీన్ అన్నదానం

కుప్పంరూరల్, అక్టోబర్ 20 ప్రభాతవార్త

కుప్పం ఎన్టీఆర్ విగ్రహం వద్ద తెలుగుదేశం పార్టీ అధ్వర్యంలో నిర్వహిస్తున్న అన్న క్యాంటీన్ అన్నదానం కార్యక్రమం గురువారంతో 140 రోజులు పూర్తి చేసుకుంది. స్థానిక దాతలతో పాటు విదేశాలనుంచి సైతం ఈకార్యక్రమంకు దాతలు విరాళాలు ఇస్తున్నారు. దీంతో కార్యక్రమంను తెదేపా నేతలు విజయవంతంగా నిర్వహిస్తున్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపిపి డా॥ వెంకటేష్, సుజల వాటర్ గిరి, ఐటిడిపి నరేష్, దాతలు పాల్గొన్నారు.

గూడూరు డివిజన్

గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి నియోజకవర్గాలు

ఎన్‌బీకేఆర్‌లో రోడ్డు భద్రతపై అవగాహన సదస్సు

కోట, అక్టోబర్ 20 ప్రభాతవార్త

కోట మండలం విద్యానగర్‌లోని ఎన్‌బీకేఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో గురువారం రోడ్డు భద్రత వారోత్సవాలలో భాగంగా విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు.ముఖ్య అతిథిగా గూడూరు రవాణా శాఖ మోటార్‌వెహికల్ ఇన్‌స్పెక్టర్ జాకీర్ విచ్చేశారు. ఆయన మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు విద్యార్థులు అనుసరించాల్సిన మెళకువలను వివరించారు. వాహనదారులకు అవగాహన లేకపోవడంతోనే రోడ్డు ప్రమా దాలు జరుగుతున్నాయని చెప్పారు.అనంతరం డైరెక్టర్ విజయకుమార్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు ప్రాథమిక దశలోనే రోడ్డు భద్రతపై అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మోటార్ వెహికల్‌ఇన్‌స్పెక్టర్‌జి.సౌజన్య,సునీల్‌కుమార్,వెహికల్‌ఇన్‌ఛార్జి విజయభాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కరకట్ట చదునుపై రైతుల ఫిర్యాదు

కోట, అక్టోబర్ 20 ప్రభాతవార్త

కోట చల్లాకాలువ సమీపంలో కరకట్ట చదును చేస్తున్నారని పెన్నక్క చెరువు ఆయకట్టు రైతులు గురువారం నీటిపారుదల ఇంజినీర్లకు ఫిర్యాదు చేశారు. ఆ మేరకు ఇంజినీర్లు సంఘటన స్థలానికి చేరుకొని చదును చేస్తున్నకరకట్టపనులను నిలిపేశారు. చట్టవిరుద్ధంగా వ్యవహరిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

సెబ్ స్టేషన్ పరిశీలన

వాకాడు, అక్టోబర్ 20, ప్రభాతవార్త

మండల కేంద్రమైన వాకాడులోని స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ బ్యూరో స్టేషన్‌ను గురువారం సబ్ సూపరింటెండెంట్ ఎస్. రవి కుమార్ ఆకస్మికంగా పరిశీలించారు. స్టేషన్‌లోని రికార్డులను పరిశీలించారు. స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ బ్యూరో పరిధజలోని కోట, వాకాడు, చిట్టమూరు మండలాల పరిధిలోని మధ్యం తరలిస్తూ పట్టుబడిన వాహనాలు బహిరంగ వేలం కార్యక్రమం ఉన్నందున తాము వచ్చామని తెలిపారు. ప్రభుత్వ నిర్ణయించిన రేటు ప్రకారం బహిరంగ వేలంలో ఉన్న పల్సర్ బైక్, ఆటో వాహనాలు అధిక రేట్లు వలన వేలంలో ఎవరు పాల్గొనకుండా వాహనాలు చూసి వెళ్లారు. వాకాడు, కోట, చిట్టమూరు మండలాల్లో సారాయి గంజాయి మత్తు పదార్థాలు అదే విధంగా కోడి పందాలు, బెట్ట్ షాపులు, షాపులో గుటక అమ్మకాలు, తదితర కూడా తెలియజేయాలని స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ బ్యూరో సూపరింటెండెంట్ రవికుమార్ తెలిపారు. ఆయన వెంట జానకి రామ్, ప్రసన్న లక్ష్మి, హెడ్ కానిస్టేబుల్స్ శ్రీనివాసులు,మహమ్మద్‌అలీ,సిబ్బంది రాజశేఖర్, శ్రీహరి రెడ్డి, బాలసుబ్రమణ్యం, కుమార్ పాల్గొన్నారు.

భవన నిర్మాణాల పనులను నేదురుమల్లి పరిశీలన

వాకాడు, అక్టోబర్ 20, ప్రభాతవార్త

వాకాడులో ఉన్న ఎస్ఎల్‌సి ప్రభుత్వ ఉన్నత పాఠశాల, జూనియర్ కాలేజీ నూతన భవన నిర్మాణ పనులను గురువారం రాష్ట్ర కమ్యూనిటీ డెవలప్మెంట్ బోర్డు చైర్మన్ నేదురుమల్లి రాం కుమార్ రెడ్డి అధికారులతో కలిసి పరిశీలించారు. నాడు నేడు పథకం ద్వారా నూతన భవన నిర్మాణం సమయంలో పక్కా ప్రణాళికతో భవనాలను నిర్మించాలని ఆయన సూచించారు. అదే విధంగా ఇంజనీర్లకు ఆయన పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. నిర్మాణం చేపట్టబోయే ప్రదేశంను రాం కుమార్ రెడ్డి కుణ్ణంగా పరిశీలించారు. ఆయన వెంట వాకాడు ఎంపిడిఓ గోపినాథ్, ఎంఈవో బాబు, ఇన్చార్జి తహశీల్దార్ సారంగపాణి, రాంబాబు, ఉపసర్పంచ్ పాపా రెడ్డి, రాజశేఖర్ రెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు ప్రవీణ్ కుమార్, ఇంజనీరింగ్ అసిస్టెంట్ రేషన్ కుమార్, ఇన్స్పెక్టర్ జగదీష్, నాయకులు, పెంచల్ రెడ్డి, ద్వారక నాథరెడ్డి, నాగూర్ రెడ్డి, శ్రీనివాసులు రెడ్డి, షనీల్ రెడ్డి, వాకాటి రవికుమార్, పాఠశాల సిబ్బంది తదితరులు ఉన్నారు.

వైసీపీ అభ్యర్థుల గెలుపు కోసం కృషి చేద్దాం

నాయుడుపేట, అక్టోబర్ 20 ప్రభాతవార్త

తూర్పు రాయలసీమ పట్టభద్రుల ఎంఎల్‌సీ అభ్యర్థి పేర్నాటి శ్యాంప్రసాద్‌రెడ్డి, ఉపాధ్యాయ ఎంఎల్‌సీ అభ్యర్థి చంద్రశేఖర్‌రెడ్డిలను వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు సమష్టిగా ఉండి గెలిపించాలని సూళ్లూరుపేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య పిలుపునిచ్చారు. గురువారం నెల్లూరులోని పీవీఆర్ కల్యాణ మండపంలో ఎంఎల్‌సీ అభ్యర్థుల గెలుపు కోసం నిర్వహించిన వైసీపీ సన్నాహక సమావేశానికి నాయుడుపేట ప్రాంతానికి చెందిన పార్టీ నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్యే పిలుపు మేరకు తరలి వెళ్లారు. నాయుడుపేట మున్సిపల్ ఛైర్‌పర్సన్ కటకం దీపిక, ఎంపీపీ కురుగొండ ధనలక్ష్మి, వైసీపీ నాయకులు కటకం జయరామయ్య, కట్టా వెంకటరమణారెడ్డి, షరీఫ్, వెంకయ్య, సిద్దయ్య, వెంకటేశ్వర్లు, కౌన్సిలర్లు దారా రవి, కావేరిపాకం అశోక్‌కుమార్, సరిత, మల్లు నీరజ, మణి, గోపాల్ తదితరులు తరలివెళ్లారు.

తడ పంచాయతీలో మొదలైన గడప గడపకు మన ప్రభుత్వం

తడ, అక్టోబర్ 20 ప్రభాతవార్త

మండల కేంద్రమైన తడ గ్రామ పంచాయతీలో గురువారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ప్రారంభించారు. సూళ్లూరుపేట ఎమ్మెల్యే, టీటీడీ బోర్డు సభ్యులు కిలివేటి సంజీవయ్య ఉదయం నుంచే కార్యక్రమంలో పాల్గొన్నారు. ఎంపీపీ కొళవి రఘు రెడ్డి, సర్పంచ్ కె.ఆర్కుగం తదితరుల ఆధ్వర్యాన ఎమ్మెల్యే గడప గడపకు వెళ్లి ప్రభుత్వ పథకాల గురించి ప్రచారం చేశారు. రాఘవ క్వార్టర్స్, బీసీకాలనీ,ఎస్సీ కాలనీలలోఎమ్మెల్యేమాట్లాడుతూ అధికారు లు, వాలంటీర్లను సమస్యల గురించి ఆరా తీశారు. ప్రభుత్వ పథకా

లు ప్రతి ఇంటికి అందేలా చూడాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఎస్సీ కాలనీ వాసులు తమకు దీర్ఘకాలిక సమస్యగా మారిన ఇంటి నివేశన స్థలాలను పంపిణీ చేయాలని కోరారు. మరికొన్ని సమస్య లను కూడా ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. తడలో ప్రాథమిక పాఠశా లకు వెళ్లి అక్కడ విద్యార్థులతో కొద్దిసేపు ముచ్చటించారు. పాఠాలతో పాటు మధ్యాహ్న భోజన పథకం గురించి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో వైసీపీ జాలర్ల సంఘం నాయకులు టి.కోదండం, యాలయ్య,మండల ఉపాధ్యక్షుడు కె.వెంకటేష్, బీసీ సెల్ నాయకులు మునుస్వామిరెడ్డి, మురుగన్, పార్టీ నాయకులు ఎం.వెంకటకృష్ణారెడ్డి, రవిరెడ్డి, రాజ్‌కుమార్, శశికుమార్, తహశీల్దార్ రామయ్య, ఎంపీడీవో మురళీకృష్ణ, పలు శాఖల ఏఈలు పాల్గొన్నారు.

పార్టీ సభ్యత్వంపై నాయకులు దృష్టి సారించాలి

- నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జ్ నెలవల సుబ్రహ్మణ్యం

ఓజిలి, అక్టోబర్ 20 ప్రభాతవార్త

పార్టీ సభ్యత్వంపై తెలుగుదేశం మండల నాయ కులు, కార్యకర్తలు ప్రత్యేకంగా దృష్టి సారించాలని సూళ్లూరుపేట నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్ ఛార్జ్, మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం, నియోజ కవర్గ పరిశీలకురాలు పర్వీన్‌తాజ్ అన్నారు. గురు వారం తెలుగు దేశం పార్టీ నాయకులు కంకణాల వరప్రసాద్‌నాయుడు నివాసంలో మండల టీడీపీ అధ్యక్షులు విజయ కుమార్‌నాయుడు ఆధ్వర్యంలో మండల పార్టీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ జగన్ ప్రభుత్వం ఏ నిర్మాణాత్మక కార్యక్రమాన్ని చేపట్టలేదన్న విషయాన్ని ప్రతి ఒక్కరూ గమనించాలన్నారు. చంద్రబాబునాయుడిని మళ్లీ ముఖ్య మంత్రిగా బాధ్యతలు స్వీకరించే వరకు ప్రతి కార్యకర్త నిర్విరామంగా కృషి చేయాలన్నారు. తెలుగుదేశం పార్టీ కార్యకర్తలపై దాడులను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించేది లేదని ఆయన అన్నారు. అధికారంలో ఉన్నా లేకున్నా ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం పోరాటాలు చేస్తామన్నారు. 2019ఎన్నికల ఫలితాలను చూసి కార్యకర్తలు నిరాశచెందవద్దని చెప్పారు. తెలుగు యువత బలోపేతానికి అవసరమైన నియోజకవర్గ, మండల కమిటీలను వేసి యువతను పార్టీ వైపు ఆకర్షితులయ్యేలా చ

ప్రజల సమస్య పరిష్కారానికి చక్కని వేదిక

గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం

ఎమ్మెల్యే భూమన కరుణాకర్ రెడ్డి

తిరుపతి కార్పొరేషన్, అక్టోబర్ 20, ప్రభాతవార్త

ప్రజల సమస్య పరిష్కారానికి చక్కని వేదిక గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం అని తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకర రెడ్డి సంతోషాన్ని వ్యక్తం చేసారు. గురువారం తిరుపతి నగర పాలక సంస్థ పరిధిలోని 11, 27 డివిజన్లలో కార్పొరేటర్లు, దొడ్డారెడ్డి ప్రవళిక రెడ్డి, మేయర్ డాక్టర్ శిరీష ఆధ్వర్యంలో పెద్ద కాపులేఔట్, జయశ్యాం రోడ్డులో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే

భూమన కరుణాకర రెడ్డి, ఉప మేయర్ ముద్ర నారాయణ హాజరై ఇంటింటికి వెళ్లి ప్రజలకు అందుతున్న సంక్షేమ పథకాలను గురించి అడిగి తెలుసుకున్నారు. తెలుగు దేశం పార్టీ సోషల్ మీడియాలో తనకు అనుకూలంగా పోస్టులు పెట్టుకుని ఆనందం పొందుతున్నారని ఎద్దేవ చేసారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు, వైసిపి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీలలో అభివృద్ధి పనులు వేగవంతం పూర్తి చేయండి

-అధికారులతో ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి

తిరుపతిరూరల్, అక్టోబర్ 20 ప్రభాతవార్త:

గ్రామ పంచాయతీలలో అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయాలని ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. అభివృద్ధి పనులపై గురువారం చంద్రగిరి నియోజకవర్గ అధికారులు, సచివాలయ ఉద్యోగులతో సమావేశం నిర్వహించారు. ప్రజలకు సంక్షేమం, అభివృద్ధి రెండు అవసరమని, అధికారులు, ప్రజాప్రతనిధుల సమన్వయంతో అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో వచ్చిన అర్జీలకు ప్రాధాన్యత కల్పిస్తూ సమస్యలు పరిష్కారం చూపాలన్నారు. తుడా నిధులతో చేపట్టే అభివృద్ధి పనులను నాలుగైదు నెలల్లో పూర్తి చేయాలన్నారు. కోట్లాది రుపాయాలు తుడా నిధులు కేటాయించినప్పటికి పనులలో జాప్యం జరగడం తగదన్నారు. తుడా నిధులచే చేసే అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు.

వేదాలు ఆచార వ్యవహారాలు సైన్సుకంటే గొప్పవి

శ్రీకాళహస్తి, అక్టోబర్ 20 ప్రభాతవార్త

మన తెలుగు వేదాలు, ఆచార వ్యవహారాలు సైన్సుకంటే గొప్పవని శుకబ్రహ్మాశ్రమ పీఠాధిపతులు శ్రీవిద్యాస్వరూపానందగిరిస్వామి అన్నారు. స్థానిక ముత్యాలమ్మగుడి కళ్యాణమండపంలో నిర్వహిస్తున్న భగవద్గీత ప్రవచనాలు ముగింపు సదస్సులో ఆలయ ధర్మకర్తల మండలి ఛైర్మన్ అంజూరు శ్రీనివాసులు పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆశ్రమ పీఠాధిపతి శ్రీవిద్యాస్వరూపానందగిరిస్వామి మాట్లాడుతూ మనవేదాలు, ఆచార వ్యవహారాలు సైన్సు విజ్ఞానాన్ని మించి జ్ఞానాన్ని అందిస్తున్నాయని తెలిపారు. ముఖ్యంగా యువతలో కూడా ఆధ్యాత్మిక భావన పెంచాలంటే ఇలాంటి ప్రవచనాలకు హాజరయ్యేలా చూడాలని ఛైర్మన్‌కు సూచించారు. ఆధ్మాతిక చింతన పెంపొందించడంలో శుకబ్రహ్మాశ్రమం నిర్విరామ కృషి చేస్తోందన్నారు. అనంతరం ముగింపు సందర్భంగా పీఠాపతిని, ఉత్తరాధికారిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఆలయ ఎసి మల్లికార్జున్, పలువురు ఆధ్యాత్మిక భక్తులు హాజరయ్యారు.

టిడిపి నాయకులు, కార్యకర్తలకు పరామర్శలు

శ్రీకాళహస్తిరూరల్, అక్టోబర్ 20 ప్రభాతవార్త

మండల తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి ఆలం.హరికృష్ణ సతీమణి ఆలం.నాగమణి ఇటీవల మృతిచెందిన విషయం విదితమే. ఈనేపథ్యంలో నియోజకవర్గ తెలుగుదేశంపార్టీ ఇన్‌ఛార్జి బొజ్జల సుధీర్‌రెడ్డి వారి నివాసానికి వెళ్లి కుటుంబసభ్యులను పరామర్శించారు. అనంతరం మృతురాలు నాగమణి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈసందర్భంగా తాము అండగా ఉంటామని ఎవ్వరు అధైర్యపడొద్దంటూ సూచించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు కామేష్‌యాదవ్, మాజీ మార్కెట్‌కమిటీ సభ్యులు చెంచయ్యనాయుడు, క్లస్టర్‌ఇన్‌ఛార్జి బత్తిరెడ్డి, సుబ్రమణ్యంనాయుడు, మరియు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

సామాజిక కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇస్తా

శ్రీకాళహస్తి/తొట్టంబేడు, అక్టోబర్ 20 ప్రభాతవార్త

పట్టణంలో సామాజిక కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇస్తానని తెలుగుదేశంపార్టీ పట్టణ అధ్యక్షుడు విజయకుమార్‌అన్నారు. గురువారం ఆయన పుట్టినరోజు సందర్భంగా పార్టీ కార్యాలయంలో పార్టీ ఇన్‌ఛార్జి సుధీర్‌రెడ్డి ఆయన్ను దుశ్శాలువతో సత్కరించారు. అనంతరం కేక్‌కట్‌చేయించి శుభాకాంక్షలు తెలిపారు. పార్టీకి కష్టపడి పనిచేయాలని కోరారు. కాగా తొట్టంబేడు మండలం సాంబయ్యపాళెంకు చెందిన తెలుగుదేశంపార్టీ నాయకురాలు చిట్టెమ్మ సారధ్యంలో విజయకుమార్‌ను దుశ్శాలువ, పూలమాతో సత్కరించి ప్రత్యేకంగా తెచ్చిన కేక్‌కట్‌చేయించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమాల్లో తిరుపతి పార్లమెంటు మహిళా అధ్యక్షురాలు చక్రాల.ఉష,పార్లమెంటు కోశాధికారి కంటారమేష్, ప్రకాష్‌నాయుడు, గోపి, సుబ్బయ్య, మిన్నల్‌రవి,జిలానీ, రాష్ట్ర నాయకురాలు రేణుకమ్మ, తొట్టంబేడు, పార్టీ పట్టణ ఉపాధ్యక్షుడు పోలూరుశ్రీనివాసులురెడ్డి, బాలాజీరెడ్డి, ప్రవీణ్, శ్రీకాళహస్తి మండల పార్టీ అధ్యక్షులు గాలిమురళీనాయుడు, కామేష్‌యాదవ్, నాయకులు ఖాదర్‌బాష, టౌన్‌బ్యాంకుమాజీ ఛైర్మన్ డివి.నారాయణ, రావిళ్ళమునిరాజనాయుడు, సురేష్, ఆర్కుగం, శ్రీలక్ష్మి అనంతరం పలువురు తెదేపా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చెవిటి మూగ (బధిర) బాలబాలికలకు ప్రీస్కూల్‌లో ప్రవేశాలు

కడప, అక్టోబర్ 20 ప్రభాతవార్త

2 నుండి 6 సంవత్సరాల లోపు చెవిటి మూగ (బధిర) బాలబాలికలకు ప్రీస్కూల్‌లో ప్రవేశాలు హెలెన్ కెల్లర్స్ బధిరుల ఉన్నత పాఠశాల, పునరావాస కేంద్రం, కడప వారు 2 నుంచి 5 సంవత్సరాల లోపు చెవిటి, మూగ బాలబాలికను ప్రీస్కూల్ నందు చేర్చుకుంటారు. వీరికి ఉచిత విద్య అందిస్తారు. వీరికి హాస్టల్ వసతి ఉండదు. వీరికి స్పీచ్ థెరపీ, ఆడిటరి ట్రైనింగ్ మాటల అభివద్ధితో పాటు ప్రీస్కూలు విద్యను అందిస్తున్నారు. తమ 2 నుంచి 6 సంవత్సరాలలోపు బధిర బాలబాలికలను ప్రీస్కూల్‌లో చేర్చదలచిన తల్లి దండ్రులు తమ బాలబాలికలను పిలుచుకుని అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్లు తీసుకొని హెలన్ కెల్లర్స్ బధిరుల ఉన్నత పాఠశాల, పునరావాసు కేంద్రం, రాజీవ్ గృహకల్ప రోడ్డు, సెంట్రల్ జైలు దగ్గర, రామాంజనేయపురం, కడప -516002 కు పిలుచుకుని రావాలని హెలన్ కెల్లర్స్ విద్యాసంస్థల జనరల్ సెక్రటరీ కరస్పాండెంట్ డాక్టర్ పి.దౌలత్‌ఖాన్ తెలిపారు.

నిరుద్యోగ యువతకు... ఎమ్మెల్యే చెవిరెడ్డి చేయూత

-మోగా జాబ్ మేళాకు విశేష స్పందన- పెద్దఎత్తున మహిళ నిరుద్యోగులు హాజరు

తిరుపతిరూరల్, అక్టోబర్ 20, ప్రభాతవార్త:

చంద్రగిరి నియోజకవర్గం వ్యాప్తంగా వున్న నిరుద్యోగ యువతకు ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి ఉద్యోగ అవకాశాలు కల్పించి, నిరుద్యోగ యువతకు చేయూతను అందిస్తున్నారు. కర్నాట రాష్ట్రం హోసూరులో వున్న టాటా ఎలక్ట్రానిక్స్ ప్రవేట్ లిమిటెడ్ కంపెనీలో మెషిన్ ఆపరేటర్లగా అవకాశం కల్పించారు. తిరుపతిరూరల్ ఎంపిడిఓ సమావేశ మందిరములో గురువారం నిర్వహించిన మెగా జాబ్ మేళాకు విశేష స్పందన లభించింది. చంద్రగిరి నియోజకవర్గంలో ఉన్న 6మండలాల నుండి సుమారు 1000మంది మహిళ అభ్యర్థులు హాజరయ్యారు. టాటా ఎలక్ట్రానిక్స్ కంపెనీ నుంచి వచ్చిన ప్రతినిధులు తమ సంస్థ నియమ నిబంధనలకు లోబడి ఇంటర్వూలను నిర్వహించారు. ఈ జాబ్ మేళాలో ఇంటర్మీడియట్, డిగ్రీ పాసై, 18-22 మధ్య వయస్సు గల యువతులకు మాత్రమే అవకాశం కల్పించారు.

- ప్రత్యేక కౌంటర్లలో ధ్రువ పత్రాలు పరిశీలన

మెగా జాబ్ మేళాకు వచ్చిన యువతుల విద్యార్హత, నివాసంలకు సంబంధించిన ధ్రువ పత్రాలను నిశితంగా పరిశీలించేందుకు ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేసారు. రిటైర్డ్ జడ్పి సిఇవో దుర్గాప్రసాద్ నేతృత్వంలో సిబ్బంది మెగా మేళాను పర్యవేక్షణ చేయగా కంపెనీల నుండి వచ్చిన ఏపి రీజనల్ హెడ్ టివిఎస్ మహదేవ్ అభ్యర్థులకు ఇంటర్వూలను పూర్తి చేసారు. రిటైర్డ్ జడ్పి సిఇవో, హెచ్ ఆర్ దుర్గాప్రసాద్ ప్రసాద్ మాట్లాడుతూ ఇంటర్ విద్యార్హతతోనే మంచి భద్రతతో కూడిన ఉద్యోగం లభిస్తుందన్నారు. ఎంపికైన 279మంది యువతులకు ఈనెల 27న విజయవాడలో శిక్షణ ఇస్తారని తెలిపారు. శిక్షణ పొందిన అభ్యర్థులకు నెలకు రూ.16500 రుపాయాలు జీతం ఇవ్వనున్నట్లు తెలిపారు.

అనుమతులు లేకుండా చీటీలు నిర్వహిస్తే చర్యలు

పుత్తూరురూరల్, అక్టోబరు 20 ప్రభాతవార్త:

గ్రామాల్లో అనుమతులు లేకుండా చీటీలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని వివాదాలకు దూరంగా ఉండాలని పుత్తూరు ఎస్ఐ గౌరిశంకర్ సూచించారు. గురువారం పుత్తూరు మండలం శిరుగురాజుపాళెం పంచాయతీలో దిగువగూళూరు గ్రామంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో నాటుసార తయారీ, విక్రయాలతో పాటు పేకాట, కోడిపందాళ్లు స్థావరాలపై పోలీసులకు సమాచారం అందించాలని, సమాచారం అందించిన వారిపేర్లను గోప్యంగా ఉంచుతామన్నారు. కుటుంబ సమస్యలపై క్షణికావేశానికి గురై ఆత్మహత్యలకు పాల్పడకుండా ఉండాలని, ఎలాంటి సమస్యలున్నా తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. చిన్న చిన్న తగాదాలతో జైలు జీవితం అనుభవించకుండా ఉండాలని సూచించారు. అనంతరం ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలోసర్పంచ్‌మురళి,హెడ్ కానిస్టేబుల్ విశ్వనాథం, పంచాయతీ కార్యదర్శి హరిత పాల్గొన్నారు.

విద్యార్థులకు ఒత్తిడి లేని విద్య చెప్పాలి

రేణిగుంట, అక్టోబరు 20 ప్రభాతవార్త:

విద్యార్థులకు ఒత్తిడి లేని విధంగా విద్యను అభ్యసింపచేయాలనిరాష్ట్రప్రాజెక్టుమేనేజర్ జయచంద్రనాయుడు అన్నారు. రేణిగుంట మండలం కరకంబాడి రాస్‌కార్యాలయంలో చైల్డ్ ఫండ్ ఇండియా ఆర్థిక సహాయంతో మండలంలోని వివిధ ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయుడు మాట్లాడుతూ విద్యార్థులు మానసిక ఒత్తిడికి గురికాకుండా ఇష్టపడి చదివే విధంగావారికివిద్యాబోధన చేయాలని కోరారు. సమావేశంలో 60 మంది ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కొండమిట్టలో పదిరోజుల నుంచి మంచినీటి సమస్య

శ్రీకాళహస్తి, అక్టోబర్ 20 ప్రభాతవార్త

కొండమిట్టలో పదిరోజులు నుంచి మంచినీటి సమస్య ఉందని దీన్ని ఎవ్వరు పరిష్కరించడం లేదని 23వ వార్డు ప్రజలు వాపోతున్నారు. గత పదిరోజులుగా మంచినీటికోసం మహిళ లు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నీటికోసం చుట్టుపక్కల ఇండ్లలో ఉన్న బోర్లు నీటిని వినియోగించుకోవాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. అంతేకాకుండా ఇటీవల జయరామారావువీధిలో కాలువపై ఉన్న ఆక్రమణలను తొలగించే నేపథ్యంలో కాలువపై ఉన్న మంచినీటిపైపులైన్లు కూడా పగిలిపోవడంతో ఈవీధిలో కూడా కొందరికి మంచినీటి సరఫరా 20రోజులు నుంచి లేకుండా ఇబ్బందులకు గురవుతున్నారు. ఇకనైనా మున్సిపల్ అధికారులు స్పందించి చర్యలుతీసుకుని ప్రజలకు మంచినీటి సమస్యలేకుండా చూడాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

మన సమస్యలను మనమే పరిష్కరించుకుందాం

మెకానిక్‌యూనియన్ సమావేశం

శ్రీకాళహస్తి,అక్టోబర్ 20 ప్రభాతవార్త

మన సమస్యలను మనమే పరిష్క రించు కుందాం. ఎవరో వస్తారని ఏదో చేస్తారని ఎదురు చూడక చర్చించు కుందాం, పరిష్కరించు కుందామని యూనియన్ నాయకుడు అంజద్ బాషా పిలుపు నిచ్చారు. గురువారం పట్టణంలోని ముత్యాలమ్మగుడి వీధి సంతమైదానంలోని షాది మహల్‌లో తిరుపతి జిల్లా మెకానికల్ యూనియన్ సమావేశం జరిగింది.ఈ సందర్భంగా అంజద్ మాట్లాడుతూ ఎవరు అధికారంలోకి వచ్చిన మెకానికల్స్ సమస్యను పట్టించుకోవటంలేదనివివరించారు.మనంకష్టజీవులం. మన రెక్కల కష్టం మీద మనం బతుకుతున్నాము. పగలురేయి లేకుండాకష్ట పడుతున్నా ము. ఎవరికి ఏ సమస్య వచ్చినా యూనియన్ దృష్టికి తీసుకురండి అని పిలుపు నిచ్చారు.సమస్యలు యూనియన్ దృష్టికి తెస్తే ఆ కుటుంబానికి ఒక నెల నిత్యావసర సరకులు రూ.5వేల కుటుంబానికి అందజేస్తామని ప్రకటించారు. జిల్లాలోని మెకానికల్స్ పాల్గొన్నారు.

ఇందిరానగర్‌లో కమిషనర్ అనుపమ ఆకస్మిక తనిఖీలు

తిరుపతి కార్పొరేషన్, అక్టోబర్ 20, ప్రభాతవార్త

తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ 24వ డివిజన్ ఇందిరా నగర్‌లో నగర పాలక సంస్థ కమిషనర్ అనుపమ అంజలి గురువారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ప్రకాశం రోడ్డులోని ప్రధాన కాలువ ఇందిరా నగర్ గుండా వెళ్తున్న పరిసరాలను పరిశీలించి కాలువ చాలా వరకు దెబ్బతిన్నదని గ్రహించి మరమ్మత్తులకు ఆదేశించారు. కొన్ని ప్రాంతాల్లో ప్రధాన కాలువ ఆక్రమణలకు గురై ఇళ్ళు నిర్మించుకొన్నారని గ్రహించి ప్లానింగ్ అధికారులకు ఆదేశాలు ఇస్తూ ఆక్రమణలకు గురైన ప్రాంతాలను తొలగించాలని ఆదేశాలు జారీ చేసారు. ఇరవై సంవత్సరాల మునుపు ఏర్పరిచిన రోడ్లు, అండర్ డ్రైనేజ్ నిర్మాణాలు పనికి రాకుండా పోయాయని స్థానిక ప్రజలు ఫిర్యాదులు చేయగా త్వరలోనే కొత్తవి నిర్మించేందుకు కౌన్సిల్ అనుమతితో పనులు చేపడుతామన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ హనుమంత్ నాయక్, ఎంఈ వెంకట్రామిరెడ్డి, వైసిపి నాయకులు ఐసిఎస్ రెడ్డి, గంగులమ్మ, నారాయణ రెడ్డి, సునీల్, రాజు, శానిటరి సూపర్‌వైజర్ చెంచయ్య, శానిటరి ఇన్స్పెక్టర్ గోపి, సిబ్బంది పాల్గొన్నారు.

పెళ్లి కాలేదని యువకుడు ఆత్మహత్య..!

గంగవరం, అక్టోబర్ 20, ప్రభాతవార్త :

పెళ్లి కాలేదని ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన గురువారం రాత్రి మండలంలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. మండలంలోని కీలపట్ల చెందిన శ్రీనివాసులు చిన్న కుమారుడు లోకేష్(27)పై 2018లో గంగవరం పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది..ఈ కేసులో నాలు గేళ్లుగా కోర్టు చుట్టూ తిరుగుతున్నాడు. లోకేష్‌కు పెళ్లి చేయాలని కుటుంబ సభ్యులు పలు సంబంధాలు చూసినా అతనిపై కేసు ఉందని అమ్మాయిని ఇవ్వడానికి ఎవరూ ముందుకు రాకపోవడం, కోర్టులో కేసు విచారణ వేగవంతంగా జరుగుతుండడంతో చేసిన తప్పుకు శిక్ష పడుతుందేమోనన్న భయంతో జీవితంపై విరక్తిచెంది పురుగులు మందు తాగి ఆత్మహత్య చేసుకుంటున్నట్లు తన తండ్రికి ఫోన్ చేసి సమా చారం ఇచ్చినట్లు తెలిపారు. తండ్రి శ్రీనివాసులు కుమారునితో నువ్వు ఎక్కడున్నావు అని అడగడంతో బెంగళూరు చెన్నై జాతీయ రహదారి పక్కన రెంటకుంట్ల సమీపంలోని ఓ చెరువులో ఉన్నానని చెప్పడంతో శ్రీనివాసులు కుటుంబ సభ్యులతో ఘటన స్థలానికి చేరుకొని అపస్మారకస్థితిలో పడి ఉన్న కుమారుడిని తీసుకొని పలమనేరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు.

ఇంట గెలిచి రచ్చ గెలవండి :-సిఎంకు జనసేన హితవు

తిరుపతి ప్రెస్‌క్లబ్,అక్టోబర్ 20 ప్రభాతవార్త:

ఇంటిలోని తల్లిని,చెల్లిని పక్క రాష్ట్రానికి తరిమేసిన మీరు రాష్ట్రంలోని మహిళలకు ఏ విధంగా న్యాయం చేస్తారు? మొదట ఇంట గెలిచి తరువాత రచ్చ గెలవాలని జనసేన జిల్లా ఇన్‌ఛార్జ్ డా॥పసుపులేటి హరిప్రసాద్ రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి హితవు పలికారు. గురువారం సాయంత్రం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అవనిగడ్డలో జరిగిన సభలో సిఎం జగన్ మాటలు దెయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉన్నాయన్నారు. వైసిపి పాలనలో మోసం తప్ప మంచి ఎక్కడుందని ప్రశ్నించారు. మంచి అంటే తమ అధినేత స్వంత డబ్బులు 5 కోట్ల రూ॥లు ఆత్మహత్యలు చేసుకున్న కౌలు రైతులకు కుటుంబానికి లక్ష చొప్పున ఇవ్వడమన్నారు. ఫీజు రియింబర్స్‌మెంట్ రాలేదని ఓ విద్యార్థి పూతలపట్టు ఎమ్మెల్యేని నిలదీస్తే అతనితో పాటు మరో 12 మంది విద్యార్థులపై 307 అటెంప్ట్ టు మర్డర్ కేసు,ఎస్సీ ఎస్టీ కేసులు పెట్టి జైలుకు పంపారు. ప్రజానాయకుడిగా,ఒక పార్టీ అధ్యక్షుడిగా ఉత్తరాంధ్రకు పవన్ వస్తే ఆయనను అక్రమంగా నిర్బంధించారు.ర్యాలీలో పాల్గొన్న వందమంది కార్యకర్తలను అరెస్ట్ చేశారు. ఇకనైనా వాటికి స్వస్తి పలకాలని సిఎర్‌కు హితవు పలికారు.

తిరుపతి డివిజన్

పంచాయతీ కార్యాలయంలో "ఆయుధ పూజ"

చంద్రగిరి, అక్టోబర్ 20 ప్రభాతవార్త:

స్థానిక పంచాయతీ కార్యాలయంలో గురువారం సర్పంచ్ ముద్దికుప్పం రూపరామమూర్తి ఆయుధ పూజ చేశారు. ఇందులో భాగంగా పంచాయతీ ఈఓ మహేశ్వరయ్య ఆధ్వర్యంలో సిబ్బంది కార్యాలయాన్ని మామిడి తోరణాలు, అరటి మొక్కలు, వివిధ రకాలు పుష్పాలు, బెలూన్లతో ముస్తాబు చేశారు. పంచాయతీ వాహనాలను శుభ్రం చేసి అలంకరణ చేశారు. అనంతరం సర్పంచ్ రూప రామమూర్తి దేవతామూర్తుల చిత్రపటాలకు ప్రత్యేక పూజలు నిర్వహించి పంచాయతీ వాహనాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్మికులకు స్వీట్లు, భోజనం వడ్డించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి హేమేంద్రకుమార్ రెడ్డి, జడ్పీటిసి యుగంధర్ రెడ్డి, ఎంపిటిసిలు బుల్లెట్ చంద్రమౌళి రెడ్డి, మాదవరెడ్డి, మార్కెట్ యార్డు చైర్మన్ సురేష్ రెడ్డి, ఉప సర్పంచ్ చంద్రశేఖర్ రెడ్డి, వైసిపి పట్టణ అధ్యక్షుడు పార్లపల్లి చంద్రశేఖర్ రెడ్డి, ఎంపిడిఓ రమేష్‌బాబు, తహశీల్దార్ శిరీషా, నాయకులు చేగు గోవర్ధన్ గుప్తా, మస్తాన్, కుప్పిరెడ్డి భాస్కర్ రెడ్డి, వార్డు సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులు శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి..!

అకడమిక్ ప్లానింగ్ కో ఆర్డినేటర్ రామచంద్రారెడ్డి

చంద్రగిరి, అక్టోబర్ 20 ప్రభాతవార్త:

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన టీచింగ్ ద రైట్ లెవెల్ శిక్షణా కార్యక్రమాన్ని ఉపాధ్యాయులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. స్థానిక శ్రీ పద్మావతీ జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు బోధనా విధానంపై మండల స్థాయిలో ఉపాధ్యాయులకు నాలుగు రోజుల శిక్షణా కార్యక్రమం ఎంఈఓ శ్రీవరం లలితకుమారి చేట్టారు. ఈ కార్యక్రమాన్ని గురువారం ఉదయం పరిశీలించిన ఆయన మాట్లాడుతూ 3వ తరగతి నుండి 5 వరకు గల విద్యార్థులకు తెలుగు, గణితంలో అభ్యసనా ఫలితాలను మెరుగుపరచడంలో ఈ శిక్షణ దోహదపడగలదన్నారు. ఉపాధ్యాయులలో సమర్థవంతమైన బోధన, ప్రాథమికంగా నైపుణ్యాలను నిర్ధారిస్తుందన్నారు. అదేవిధంగా మధ్యాహ్నం డివైఈఓ ఆనంద రెడ్డి శిక్షణా కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం వెంకటనారాయణ చౌదరి, సిఆర్‌పిలు పాల్గొన్నారు.

తిమ్మప్ప దేవాలయ నిర్మాణానికి పద్మశాలి సంఘం మద్దతు

పద్మశాలి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జగ్గారపు శ్రీనివాస్

చంద్రగిరి, అక్టోబర్ 20 ప్రభాతవార్త:

తిమ్మప్ప దేవాలయ పునర్నిర్మాణానికి పద్మశాలి సంఘం మద్దతు ఇస్తున్నట్లు ఏపి పద్మశాలి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జగ్గారపు శ్రీనివాస్ తెలిపారు. తొండవాడ వద్ద గల తిమ్మప్ప దేవాలయాన్ని గురువారం ఆయన తన కమిటీ సభ్యులతో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తిమ్మప్ప దేవాలయ పునర్నిర్మాణ సమితి అధ్యక్షుడు తపసి మురళి రెడ్డి ఆలయ పునర్నిర్మాణానికి పూనుకోవడం పట్ల అభినందనలు తెలిపారు. తమ పద్మశాలి సంఘం తరపున ఆలయ నిర్మాణానికి తాము సహకరిస్తామని హామీ ఇచ్చారు.

తోటల పెంపకాన్ని ప్రోత్సహించండి

పిడి శ్రీనివాస్ ప్రసాద్

రామచంద్రాపురం, అక్టోబర్ 20 ప్రభాతవార్త:

ఉద్యానవన తోటల పెంపకాలను ప్రోత్సహించాలని తిరుపతి జిల్లా డ్వామా పిడి శ్రీనివాస్ ప్రసాద్ అన్నారు. గురువారం కుప్పం బాదూరు, రాయలచెరువు పేట పంచాయతీలలో ఉపాధిహామీ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూలీల సంఖ్య పెంచాలన్నారు. మునగ తోటల పెంపకంపై రైతులు ఆసక్తి చూపే విధంగా ప్రోత్సహించాలన్నారు. ఎకరాకు సుమారు రూ.1.80 లక్షలు ప్రభుత్వం మంజూరు చేస్తుందన్నారు. కుప్పం బాదూరులో అవెన్యూ ప్లాంటేషన్, హార్టీ కల్చర్, సచివాలయ భవన నిర్మాణ పనులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. రాయలచెరువులో హౌసింగ్ లే అవుట్ పనులు, రోజా తోటల పెంపకాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఏపిఓ హంసవేణి, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

అనుమానస్పదంగా కనిపిస్తే పోలీసులకు తెలపండి : ఎస్ఐ

నారాయణవనం, అక్టోబర్ 20 ప్రభాతవార్త :

నారాయణవనం మండల పరిధిలో ఎక్కడైనా అనుమానస్పదంగా ఎవరైనా కనిస్తే వెంటనే స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వాలని స్థానిక ఎస్ఐ మాల్య పరమేష్‌నాయక్ గురువారం విలేఖరుల సమావేశంలో తెలిపారు. ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం చాలాచోట్ల కొంత మంది వ్యక్తులు పగటి పూట చెత్త కుప్పలను, ప్లాస్టిక్ కాగితాలను సేకరించే వారిగా తిరిగి రాత్రిపూట చోరీలకు పాల్పడడం, హత్యలు చేయడం జరుగుతున్నట్టు గుర్తించినట్టు గుర్తు చేశారు.

ఉపాధ్యాయులకు తరళ్‌పై ముగిసిన శిక్షణ తరగతులు

నారాయణవనం, అక్టోబర్ 20 ప్రభాతవార్త :

మండలకేంద్రంలోని స్థానిక ఎమ్మార్సీ భవనంలో నాలుగు రోజులుగా జరుగుతున్న తరళ్‌పై శిక్షణ తరగతులు గురు వారంతో ముగిసింది. గురువారం ప్రతమ్ ఫౌండేషన్(ప్రతి విద్యార్థి పాఠశాలకు మరియు బాగా చదుకోవాలని) అనే అం శంపై ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చారు. తరళ్ ద్వారాఉపా ధ్యాయులకు ఇచ్చే శిక్షణతో తరగతిలో పిల్లలకు ఎలా భోదించాలి, వారి సామర్థ్యం, తెలితేటలను బట్టి వివిధ గ్రూపులుగా విభజించి వారికి అర్థమయ్యేలా బోధించాలన్నారు. ఈ కార్యక్రమంలో కో ఆర్డినేటర్, ఎంఇఓ కె భారతి, ఉపాధ్యాయులు, రీసోర్స్ పర్సన్స్‌లు వై మునికుమార్, డిటి శరవణన్, కె విజయభారతి, ఎ షాలిని తదితరులు పాల్గొన్నారు.

టౌన్‌బ్యాంకును ఖాతాదారులే కాపాడుకోవాలి

:నవీన్‌కుమార్‌రెడ్డి

తిరుపతి,అక్టోబర్ 20ప్రభాతవార్త:

వందసంవత్సరాల చరిత్ర ఉన్న, కోఆపరేటివ్ బ్యాంకుల్లో తిరుపతి టౌన్‌బ్యాంకుఆర్థికలావాదేవీలు గణనీయంగా ఉన్నాయని రాయలసీమ పోరాటసమితి కన్వీనర్ పి.నవీన్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ఎంతోమంది ఖాతాదారుల నమ్మకంతోనే టౌన్‌బ్యాంకు అభివృద్ధి చెంది వందేళ్ళ చరిత్రసృష్టించిందని,మరో వందేళ్ళు బ్యాంకును పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ఖాతాదారులపైనే ఉందని అన్నారు. నగరంలోని ప్రధాన కూడళ్లలో ప్రజలకు అందుబా

ఎపిపిఎస్‌సి పరీక్షలకు పక్కా ఏర్పాట్లు

- జిల్లా రెవెన్యూ అధికారి రాజశేఖర్

చిత్తూరు, అక్టోబర్ 20 ప్రభాతవార్త: జిల్లాలో శుక్రవారం జరుగనున్న ఎపిపిఎస్‌సి పరీక్షలకు పక్కా ఏర్పాటు చేపట్టి పూర్తి చేయాలని జిల్లా రెవెన్యూ అధికారి రాజశేఖర్ అధికారులను ఆదేశించారు. అగ్రికల్చరల్ ఆఫీసర్స్, అసిస్టెంట్ డైరెక్టర్ ఇన్ సర్వే లాండ్ రికార్డ్స్, పోలీసు డిపార్ట్‌మెంట్‌లో టెక్నికల్ అసిస్టెంట్ పోస్టులకు జిల్లాలో రెండు పరీక్షా కేంద్రాల్లో ఎపిపిఎస్‌సి పరీక్షలు నిర్వహించనుందని డిఆర్‌ఓ రాజశేఖర్ పేర్కొన్నారు. జిల్లా సచివాలయంలోని డిఆర్‌ఓ ఛాంబర్‌లో గురువారం డిఆర్‌ఓ రాజశేఖర్ ఎపిపిఎస్‌సి పరీక్షల నిర్వహణ ఏర్పాట్లపై అధికారులతో సమీక్షించారు. ఈ సమావేశంలో డిఆర్‌ఓ మాట్లాడుతూ చిత్తూరులోని సీతమ్స్, ఎస్‌విసెట్ కళాశాలల్లో శుక్రవారం ఉదయం 280 మంది అభ్యర్థులు, మధ్యాహ్నం 180 మంది అభ్యర్థులు పరీక్షలకు హాజరు కానున్నారన్నారు. ఈ పరీక్షలకు చిత్తూరు, ఐరాల డిప్యుటీ తహసిల్దార్లు లైజన్ ఆఫీసర్లుగా వ్యవహరిస్తారన్నారు. పరీక్షల నిర్వహణ ఉదయం సెషన్స్ 9.30 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం సెషన్స్ 2.30 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహించడం జరుగుతుందన్నారు. అభ్యర్థులను ఉదయం 8 నుండి 9 గంటల వరకు మధ్యాహ్నం 1 గంట నుండి 2 గంటల వరకు మాత్రమే పరీక్షా కేంద్రాల్లోకి అనుమతించడం జరుగుతుందన్నారు. అభ్యర్థులు పరీక్షా కేంద్రాల్లోకి ఎలక్ట్రానిక్ పరికరాలు తీసుకెళ్ళరాదని స్పష్టం చేశారు. అభ్యర్థులు పరీక్షా కేంద్రాల్లోకి మొబైల్ ఫోన్లు తీసుకొని వస్తే వాటిని పరీక్షా కేంద్రాల సూపరిటెండెంట్లు ఒక కౌంటర్ ఏర్పాటు చేసి అభ్యర్థుల నుండి సెల్‌ఫోన్లను తీసుకోవాలన్నారు. పోలీసు అధికారులు పరీక్షా కేంద్రాల్లో పక్కా బందోబస్తు నిర్వహించేలా ఏర్పాట్లు చేపట్టాలన్నారు. తహసిల్దార్లు 144 సెక్షన్‌ను పర్యవేక్షించాలన్నారు. ఎపిపిఎస్‌సి రాష్ట్ర సెక్రటరీ వెంకట్రావ్ మాట్లాడుతూ పరీక్షా కేంద్రాలకు ఉదయం 7.30 గంటలకు లైజన్ అధికారులు చేరుకోవాలన్నారు. పరీక్షా కేంద్రాల సూపరిటెండెంట్లు అభ్యర్థుల రోల్ నెంబర్లు తెలిసేలా బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. ఈ సమావేశంలో సెక్షన్ ఆఫీసర్ మల్లికార్జున్‌రెడ్డి, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

ఖర్గేతో కాంగ్రెస్‌దే భవిష్యత్ :చిట్టిబాబు

తిరుపతి, అక్టోబర్ 20 ప్రభాతవార్త: 137 ఏళ్ళ చరిత్ర ఉన్న జాతీయ కాంగ్రెస్ పార్టీలో అంతర్గత ప్రజాస్వామ్యానికి నిదర్శనమే ఏఐసిసి అధ్యక్షుడిగా దళిత నాయకుడు మల్లికార్జునఖర్గే విజయమని పిసిసి ఎస్సీ విభాగం కోఛైర్మన్ గొడపేరు చిట్టిబాబు తెలిపారు. దేశ రాజకీయాల్లో భవిష్యత్తు కాంగ్రెస్‌పార్టీదేనని జోస్యం చెప్పారు. కాంగ్రెస్ పార్టీలో దామోదర సంజీవయ్య తరువాత దళిత కులానికి చెందిన ఖర్గే నేడుకాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడుగా బాధ్యతలు చేపట్టడం చరిత్రలో చిరస్థాయిగా నిలచిపోతుందని అన్నారు. ఆదినుంచి దళితులు, బడుగు,బలహీన వర్గాల పార్టీగా కాంగ్రెస్‌కు నేడు మల్లికార్జున ఖర్గే సారధ్య బాధ్యతలు చేపట్టడం శుభపరిణామమన్నారు. ప్రజా, బడుగు బలహీన వర్గాల నేతగా ఆయనకున్న అనుభవం దేశంలో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేస్తుందని చిట్టిబాబు ఆశాభావం వ్యక్తం చేశారు. ముఖ్యంగా ఆయన విజయం పట్ల దళితులు సంబరాలు చేసుకుంటున్నారని చెప్పారు. ఏఐసిసి అధ్యక్షుడు ఖర్గేకు శుభాకాంక్షలు తెలియజేస్తూ ఆయన నాయకత్వంలో భవిష్యత్తు కాంగ్రెస్ పార్టీదేనన్నఆశాభావాన్ని వ్యక్తం చేశారు. ఇందుకు సహకరించిన ఏఐసిసి మాజీ అధ్యక్షురాలు సోనియాగాంధీ, యువనేత రాహుల్‌గాంధీ, ప్రియాంక గాంధీలకు ఇతర కాంగ్రెస్ ప్రముఖులకు అభినందనలు తెలిపారు. యువనేత రాహుల్‌గాంధీ కన్యాకుమారి నుంచి ప్రారంభించిన జోడో యాత్రలో భాగస్వాములవుతున్న రాష్ట్ర కాంగ్రెస్ కమిటీ ఎస్సీ విభాగం ఛైర్మన్ కొరివి వినయకుమార్, కో ఛైర్మన్లు ఆదిశంకర్, మల్లికార్జున,మహేష్‌కుమార్, మట్ట వరప్రసాద్‌లు పాల్గొనడం అభినందనీయమన్నారు.

సభ్యులు హాజరు కాకపోతే సమావేశాలెందుకు?

-ప్రజా సమస్యలపై సభ్యులు ప్రస్తావించాలి -మండల మీట్‌లో పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్.బాబు

తవణంపల్లె, అక్టోబర్ 20 ప్రభాతవార్త: ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రతి మూడు నెలలకు ఒకసారి జరిగే మండల సర్వసభ్య సమావేశాలకు సభ్యులు సక్రమంగా హాజరు కాకపోతే సమావేశాలు ఎందుకు నిర్వహించడమని పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్.బాబు అసహనం వ్యక్తం చేశారు. గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో వైస్ ఎంపీపీలు శోభ, పట ్నం ప్రతాప్‌రెడ్డిల అధ్యక్షతన జరిగిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశంకు ఎమ్మెల్యే బాబు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈసందర్భంగా సమావేశానికి పలువురు ఎంపీటీసీలు, సర్పంచ్‌లు గైర్హాజరవడంపై అసంతృప్తి వ్యక్తం చేస్తూ ప్రజా సమస్యల పరిష్కారానికి వేదికైన మండల పరిషత్ సర్వసభ్య సమావేశాలకు సభ్యులు హాజరు కానపుడు సమావేశాలు ఎందుకు నిర్వహించడమన్నారు. అలాగే సమావేశానికి వచ్చిన సభ్యులు సైతం ఆయా గ్రామాల్లో నెలకొన్న సమస్యల పట్ల స్పందించకుండా కూర్చుంటే ప్రజా సమస్యలు ఎలా పరిష్కారమవుతాయని అన్నారు. అలాగే అధికారులు కూడ సమావేశంలో సభ్యులు ప్రస్తావించిన సమస్యలను వెంటనే పరిష్కరించే దిశగా చర్యలు చేపట్టాలన్నారు. మండలం లోని ఎంపీటీసీలు,సర్పంచ్‌లు అసంతృప్తితో వున్నారని, అధికారులు ప్రతి ఒక్కరూ గ్రామ స్థాయిలో ముఖ్య వ్యక్తులైన ఎంపీటీసీలు, సర్పంచ్‌లకు తగిన గౌరవం ఇవ్వాలని లేని పక్షంలో తీవ్ర పరిణామాలు వుంటాయని ఎమ్మెల్యే హెచ్చరించారు. గ్రామాలలో ప్రాధాన్యతా క్రమంలో అభివృద్ధి పనులకు ప్రణాళికలు రూపొందించాలని, గడప గడపకు-మనప్రభుత్వం కార్యక్రమం ద్వారా వచ్చిన సమస్యల పరిష్కారానికి సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాలని ఆయన ఆదేశించారు. ఈసందర్భంగా దిగువ తడకర గ్రామ పరిధిలో ప్రభుత్వ భూములు, వాగులు, వంకలు, చెరువులు కబ్జాకు గురవుతున్నా రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదని సభ్యులు ఆరోపించారు. సమావేశంలో జడ్పీటీసీ భారతి, ఎంపీడీఓ ఎం.హరిప్రసాద్‌రెడ్డి, తహశీల్దార్ సుశీల, మండల స్థాయి అధికారులు, ఎంపీటీసీలు,సర్పంచ్‌లు పాల్గొన్నారు.

పోలీసుల టిఎ బకాయిలు మంజూరు చేయండి

:ఆర్థికమంత్రి బుగ్గనకు పోలీసు అధికారుల సంఘం వినతి

తిరుపతి,అక్టోబర్ 20ప్రభాతవార్త: ఆంధ్రప్రదేశ్‌లో పోలీసులకు చాలా కాలంగా చెల్లించాల్సిన 13నెలల టిఎల తోబాటు బకాయి ఉన్న అడిషనల్ సరెండర్ లీవ్ శాలరీ నిధులను వెంటనే మంజూరు చేయించాలని రాష్ట్ర ఆర్థికమంత్రి బుగ్గన రాజేంద్ర నాథరెడ్డికి తిరుపతి జిల్లా పోలీసు అధికారుల సంఘం నాయకులు విజ్ఞప్తి చేశారు. గురువారం ఉదయం తిరుపతిలో జరిగిన ఓ కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర ఆర్థికమంత్రి బుగ్గన రాజేంద్రనాథరెడ్డిని తిరుపతి జిల్లా పోలీసు అధికారుల సంఘం నాయకులు అధ్యక్షుడు ఎం.సోమశేఖరరెడ్డి,రాష్ట్రగౌరవ సలహా దారుడు, జిల్లా సంయుక్త కార్యదర్శి జి.శంకర్‌రెడ్డి, అసోసియేషన్ కోశాధికారి కామరాజు కలిశారు. పుష్పగుచ్చం అందించి, తమ సమస్యలపై వినతిపత్రం అందజేశారు. రాష్ట్రంలో పోలీసుశాఖలో పనిచేస్తున్న పోలీసు కానిస్టేబుల్ నుంచి ఆపై కేడర్ వరకు 13నెలలుగా టిఎ బకాయిలు ఉన్నాయన్నారు. అలాగే ఎఎస్ ఎల్ఎస్ కూడా బకాయిలతో పోలీసులు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారని ,దీన్ని వెంటనే విడుదల చేయిస్తే దీపావళి పండుగను కుటుంబసభ్యులతో సంతోషంగా జరుపుకునే అవకాశం కలుగుతుందని విజ్ఞప్తి చేశారు. ఈ విషయంపై మంత్రి వెనుక ఉన్న రాష్ట్ర ఆర్థికశాఖ కార్యదర్శి ఎస్ఎస్ రావత్‌ను పిలిచి పోలీసుల బకాయి నిధులు మంజూరుచేయాలని సూచించారని తెలిపారు. స్పందించిన రాష్ట్రమంత్రి బుగ్గన రాజేంద్రనాథరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

రాష్ట్ర అథెట్లిక్స్‌కు మదన్ ఎంపిక

బంగారుపాళ్యం, అక్టోబర్ 20 ప్రభాతవార్త: రాష్ట్ర స్థాయిలో జరిగే అథెట్లిక్స్ పోటీలకు టేకుమంద జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థి మదన్ ఎంపిక య్యాడు. ఈ నెల 11వ తేదీ తిరుపతి ఎస్వీ యూనివర్సిటీ క్రీడా మైదానంలో జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో మదన్ విశేష ఆట ప్రతిభ కనబరిచాడు. 800 మీటర్ల పరుగు పందెంలో మదన్ రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొననున్నట్లు పాఠశాల పిఇటి దేవేంద్ర తెలిపారు. ఈ నెల 23వ తేదీ పశ్చిమ గోదావరి జిల్లా ఏలూరులో జరిగే రాష్ట్ర స్థాయి అథ్లెటిక్ పోటీలకు మదన్ పాల్గొంటారని చెప్పారు. పాఠశాలకు చెందిన విద్యార్థి రాష్ట్ర స్థాయి అథ్లెటిక్ పోటీలకు ఎంపిక కావడం పట్ల పాఠశాల హెడ్మాస్టర్ సుభాన్, రాష్ట్ర కురబ కార్పొరేషన్ డైరెక్టర్ అమరనాథ్, సర్పంచ్ రత్నయ్య, ఇతర ఉపాధ్యాయులు మదన్‌ను అభినందించారు.

గజ బాధిత రైతులకు చెక్కులు పంపిణీ

బంగారుపాళ్యం, అక్టోబర్ 20 ప్రభాతవార్త: మండల పరిధిలో ఏనుగుల దాడుల వల్ల పంట నష్టం జరిగిన రైతులకు గురువారం పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు చెక్కులు పంపిణీ చేశారు. స్థానిక ఎంపిడిఓ కార్యాలయంలో 49 మంది బాధిత రైతులకు 3.87 లక్షల రూపాయల చెక్కులను ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మూడు నెలల్లోనే ఏనుగుల దాడుల్లో నష్టపోయిన రైతులకు ప్రభుత్వ పరంగా నష్టపరిహారం చెల్లించడం జరిగిందని చెప్పారు. మిగిలిన రైతులకు సైతం త్వరలో నష్టపరిహారం చెల్లించడం జరుగుతుందన్నారు. అలాగే పంట నష్ట పరిహారం తక్కువగా వుందని పలువురు రైతులు తమ దృష్టికీ తీసుకువచ్చారని ఈ విషయంను రాష్ట్ర అటవీశాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్ళి పరిహారం పెంచడానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి అమరావతమ్మ, జడ్పీటిసీ సోమశేఖర్, వైస్ ఎంపిపిలు శిరీష్‌రెడ్డి, జయకుమార్‌లు, ఎంపిడిఓ శ్రీధర్, తహసిల్దారు బెన్నురాజ్, సింగిల్‌విండో ఛైర్మన్ దత్తాత్రేయరెడ్డి, వైకాపా నాయకులు కృష్ణమూర్తి, ప్రవీణ్‌రెడ్డి, శరత్‌రెడ్డి, దొరస్వామి, మహేంద్ర, కిషోర్‌కుమార్‌రెడ్డి, ఎఫ్ఎస్‌ఓలు శివకుమార్, జయశేఖర్, అటవీ సిబ్బంది ఢిల్లీ రాణి, పద్మావతి, ప్రతాప్, సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

బ్యానర్ల నిషేధానికి పక్కా చర్యలు : జాయింట్ కలెక్టర్

చిత్తూరు, అక్టోబర్ 20 ప్రభాతవార్త: రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల జారీ చేసిన జిఓనెం.65 పక్కా అమలుకు చర్యలు తీసుకొంటామని జాయింట్ కలెక్టర్ వెంకటేశ్వర్ పేర్కొన్నారు. విజయవాడ నుండి గురువారం ఎన్విరాన్మెంటల్ అటవీ సైన్స్, టెక్నాలజీ కార్యదర్శి నీరబ్ కుమార్ జాయింట్ కలెక్టర్ వెంకటేశ్వర్, ఇతర అధికారులతో బ్యానర్ల నిషేధంపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడుతూ జిల్లాలో బ్యానర్లు తయారు చేసే సంస్థలను గుర్తించి వారికి అవగాహన కల్పించి ఈ నెల 31వ తేదీలోపు వారి వద్ద వున్న మెటీరియల్ మొత్తం ముగిసేలా చూడాలని లేకుంటే సీజ్ చేయాలని స్పష్టం చేశారు. అలాగే నిర్ణయించిన మేరకు ప్లాస్టిక్ కవర్లను సైతం అనుమతించకూడదన్నారు. దీనిపై జాయింట్ కలెక్టర్ వెంకటేశ్వర్ మాట్లాడుతూ చిత్తూరు జిల్లాలో బ్యానర్లు తయారు చేసే 32 సంస్థలను గుర్తించడం జరిగిందన్నారు. ఇప్పటికీ వీరికి నోటీసులు ఇవ్వడం జరిగిందన్నారు. అలాగే మండల స్థాయిలో ఇప్పటికే కొంతమందికి అవగాహన కల్పించడం జరిగిందని మళ్ళీ మండల, జిల్లా స్థాయిలో దుకాణదారులకు బ్యానర్ల నిషేధంపై పూర్తి స్థాయి అవగాహన కల్పిస్తామన్నారు. చిత్తూరు జిల్లాకు సరిహద్దుగా కర్నాటక, తమిళనాడు రాష్ట్రాలు వుండటంతో రా మెటీరియల్ ఎక్కువగా బయటి ప్రాంతాల నుండి రావడం జరుగుతుందని దీనిపై నిఘా వుంచడం జరుగుతుందన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జెసి వెంకటేశ్వర్‌తో పాటు జడ్పీ సిఇఓ ప్రభాకర్‌రెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి లక్ష్మీ, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారి నరేంద్ర, మున్సిపల్ అసిస్టెంట్ కమీషనర్ గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమం కోసం సిఎం నిరంతర కృషి : ఎమ్మెల్సీ భరత్

కుప్పంరూరల్, అక్టోబర్ 20 ప్రభాతవార్త : రాష్ట్ర ప్రజల సంక్షేమం కోసం సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి నిరంతరం కృషి చేసినట్లు ఎమ్మెల్సీ, జిల్లా వైకాపా అధ్యక్షుడు కెఆర్‌జె భరత్ పేర్కొన్నారు. గురువారం అడవిబూదుగూరు పంచాయతీలో గడపగడపకు మీ ప్రభుత్వం కార్యక్రమాన్ని ఆయన చేపట్టారు. ఈసందర్భంగా ప్రతి ఇల్లు తిరిగి ప్రభుత్వ పథకాలు అందుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. ప్రజల కష్టసుఖాలు తెలుసుకునేందుకే గడపగడపకు కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. 2024 ఎన్నికల్లో తనను గెలిపిస్తే మరింత అభివృద్ధి చేస్తామన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ హెచ్ఎం మురుగేష్, ఎంపిపి అశ్విని మురుగేష్, జడ్పీటిసి ఎడిఎస్ శరవణ, రాష్ట్ర వన్నియకుల క్షత్రియ కార్పొరేషన్ ఛైర్మన్ వనిత శ్రీను, స్థానిక నేతలు పాల్గొన్నారు.

175 సీట్లు గెలిచే సత్తా ఉంటే

ప్రతిపక్షాలపై ఎందుకు ఆంక్షలు? :బొజ్జల సుధీర్‌రెడ్డి

శ్రీకాళహస్తి,అక్టోబర్ 20 ప్రభాతవార్త : రాష్ట్రంలో 175 సీట్లు గెలిచే సత్తా ఉన్న వైకాపా పాలకులు, ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి వారి సహాచరులు ప్రతిపక్షాల సమావేశాలు, పర్యటనలను అడ్డుకోవటం ఎందుకు? ఆంక్షలు విదించటం ఎందుకని శ్రీకాళహస్తి తెలుగుదేశం ఇన్‌చార్జి బొజ్జల సుధీర్‌రెడ్డి ప్రశ్నించారు. గురువారం ఆయన ఎన్‌టిఆర్ భవన్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడరు. ఒక్క చాన్స్ అంటూ జగన్మోహన్ రెడ్డిని, ఒక్కసారి ఓడిపోయాడే అని సానుభూతితో శ్రీకాళహస్తి నియోజకవర్గ శాసనసభ్యుడుగా మధుసూధనరెడ్డిని గెలిపించిన ప్రజలు ఇప్పటికైనా మేల్కొనాలని సుధీర్‌రెడ్డి సూచించారు. 35 సంవత్సరాలు పరిపాలించిన తన తండ్రి హయాంలో ఏ ఒక్కరిపై అయినా, ప్రతిపక్షాలపై పోలీసు కేసులు బనాయించటం జరిగిందా? మూడున్నర ఏళ్ళ పాలనలో శ్రీకాళహస్తిలో తనపై 11 కేసులు, తమకార్యకర్తలపై కేసులు బనాయించటం చూస్తే అరాచకపాలన సాగుతుందన్నారు. శ్రీకాళహస్తి ప్రజలు గుర్తించాలన్నారు. రాజమండ్రితో రైతులు తమ న్యాయమైన డిమాండ్ల కోసం పాదయాత్ర చేస్తుంటే ప్రజా ప్రతినిధి భరత్ దాడి చేయిస్తారా? అంటూ ప్రశ్నించారు.

పవన్‌కళ్యాణ్ ఏమైనా తీవ్ర వాదా?

నేడు రాష్ట్రంలో చోటు చేసుకుంటున్న సంఘటనలు రాష్ట్రంలో పరిపాలనకు అద్దం పడుతుందని సుధీర్‌రెడ్డి ధ్వజమెత్తారు. విశాఖలో చోటు చేసుకున్న పవన్ సంఘటనను గురించి మాట్లాడుతూ ఆయనేమైనా పాకిస్తానీయుడా? లేక తీవ్రవాదా? అని ప్రశ్నించారు. శ్రీకాళహస్తీశ్వరాలయంలో గడ్డిపరక నుంచి స్టోర్స్ వరకు ప్రజాప్రతినిధికి 60 శాతం చెల్లించాలి. ఆయనే సమస్యలు సృష్టిస్తారు. ఆయనే పంచాయతీలు చేస్తారు? తన వాటా ఖరారు చేసుకుని వసూలు చేసుకుంటారని ధ్వజమెత్తారు. ఇక ఈ నియోజకవర్గంలో జరుగుతున్న్ని భూకుంభకోణాలు ఎక్కడా లేదు. రేణిగుంట వద్ద వెంకటాపురంలో ఎకరా రూ.7.5కోట్లు విలువ కల్గిన ఐదున్నర ఎకరాల భూ కుంభకోణానికి సంబంధించి తహశీల్దార్, ఆర్‌డిఓ, కలెక్టర్‌కు విన్నవించినా పట్టించుకోలేదని సుధీర్‌రెడ్డి ధ్వజమెత్తారు.

4న శ్రీకాళహస్తికి చంద్రబాబునాయుడు రాక

శ్రీకాళహస్తి,అక్టోబర్ 20 ప్రభాతవార్త : రాష్ట్ర తెలుగుదేశం నాయకుడు నారాచంద్రబాబునాయుడు నవంబర్ 4న శ్రీకాళహస్తికి వస్తున్నట్లు నియోజకవర్గ ఇన్‌చార్జి బొజ్జల సుధీర్‌రెడ్డి గురువారం తెలిపారు.పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ మూడు రోజుల పాటు నారాచంద్రబాబునాయుడు పర్యటన ఉందన్నారు. నవంబర్ 2,3న నెల్లూరులో మినిమహానాడు, సమన్వయ సమావేశాలు జరుగుతాయని వివరించారు. 4వ తేది మధ్యాహ్నం వెంకటగిరిలో బహిరంగ సభ నిర్వహిస్తారని మధ్యాహ్నం '4-5గంటల మధ్య శ్రీకాళహస్తి నడిబొడ్డులో బహిరంగసభ ఏర్పాటు చేసామన్నారు. సమావేశంలో పట్టణ పార్టీ అధ్యక్షుడు విజయకుమార్ మహిళా నాయకులు రేణుకమ్మ, చక్రాల ఉష తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ బ్యాన్‌పై నగర పాలక సంస్థ నుంచే తొలి అడుగు

మేయర్ శిరీష, కమిషనర్ అనుపమ అంజలి

తిరుపతి కార్పొరేషన్, అక్టోబర్ 20, ప్రభాతవార్త : ప్లాస్టిక్ బ్యాన్ పై మా నుంచే తొలి అడుగుగా వుండాలని తమ నగర పాలక సంస్థ కార్యాలయంలో ప్లాస్టిక్ బాటిల్స్ వినియోగాన్ని పూర్తి స్థాయిలో అరికట్టుతూ గ్లాసుల వినియోగాన్ని, మట్టి గ్లాసుల వినియోగాన్ని తీసుకువస్తున్నట్లు తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ డా. శిరీష, కమిషనర్ అనుపమ అంజలి అన్నారు. గురువారం తిరుపతి మున్సిపల్ కార్యాలయంలో ప్లాస్టిక్ బ్యాన్ పై మేయర్ డా. శిరీష, కమిషనర్ అనుపమ అంజలి, డిప్యూటి మేయర్లు భూమన అభినయ్ రెడ్డి, ముద్రనారాయణ ప్లాస్టిక్ ప్రత్యామ్నాయంపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మేయర్ శిరిషా మాట్లాడుతూ మైక్రాన్ లోపల వుండే ప్లాస్టిక్‌ను పూర్తిగా నిషేదించడం జరిగిందన్నారు. ప్లాస్టిక్ భూమిలో పూర్తిగా కలిసి పోవడానికి దాదాపు 4 వందల సంవత్సరాలపైనే పడుతుందన్నారు. ప్లాస్టిక్ వినియోగం వలన చర్మసంబంధ వ్యాదులు, పుట్టెబిడ్డల ఎదుగుదల సమస్యలు, అనేక అవయవాల క్యాన్సర్ వ్యాధులు వస్తున్నాయని మేయర్ తెలిపారు. ప్లాస్టిక్‌ను రూపుమాపేందుకు తిరుపతి నగర పాలక సంస్థ కార్యాలయంలో నేటి నుంచి ప్లాస్టిక్ వినియోగాన్ని అరికడుతూ గాజు గ్లాసులు, మట్టి కప్పుల వినియోగాన్ని తీసుకువస్తున్నట్లు మేయర్ డాక్టర్ శిరీషా ప్రకటించారు. డిప్యూటీ మేయర్ భూమన అభినయ్ రెడ్డి మాట్లాడుతూ తిరుపతి ప్రజలందరూ ప్లాస్టిక్‌ను అరికట్టెందుకు సహకరించాలని కోరారు. డిప్యూటీ మేయర్ భూమన అభినయ్ రెడ్డి మాట్లాడుతూ తిరుపతి ప్రజలందరూ ప్లాస్టిక్ రహిత నగరంగా తీర్చిదిద్దాలని విజ్ఞప్తి చేసారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ సునీత, ఉప కమిషనర్ చంద్రమౌళీశ్వర్ రెడ్డి, కార్పొరేటర్లు ఎస్‌కె బాబు, రామస్వామి, వెంకటేశ్వర్లు, నరసింహాచారి, హనుమంత నాయక్, నరేంద్రనాథ్, అంజినేయులు, తిరుత్తణి హరికృష్ణ, డిఈ విజయ కుమార్ రెడ్డి, మేనేజర్ చిట్టిబాబు పాల్గొన్నారు.

మధుసూదన్‌రెడ్డికి బ్రహ్మరథం పట్టిన ప్రజలు

రేణిగుంట, అక్టోబరు 20 ప్రభాతవార్త: రేణిగుంట మండలం కరకంబాడి పంచాయతీ గుండ్రాళ్ళ కాలువ, చైతన్యపురం తదితర గ్రామాల్లో గడప గడపకు వైకాపా ప్రభుత్వ కార్యక్రమంలో గురువారం ప్రజలు ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డికి బ్రహ్మరథం పట్టారు. అడుగడుగునా ఆయనకు మంగళ హారతులతో స్వాగతం పలికారు. గడప గడపకు తిరిగిన ఆయన ప్రజల సమస్యలను తెలుసుకుని వెంటనే పరిష్కరించాల్సిందిగా అధికారులను ఆదేశించారు. ఎక్కువ మార్కులు సాధించిన విద్యార్థులను అభినందించారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ జనసేనని పవన్‌కల్యాణ్‌పై నిప్పులు చెరిగారు. పవన్‌కల్యాణ్ సంబోధించిన తీరు చెప్పుతో కొడతా అని వాడిన పదజాలంపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబునాయుడు రాసిన స్క్రిప్టు చదివాడని పవన్‌కల్యాణ్‌ను దుయ్యపట్టారు. కార్యక్రమంలో ఎంపీపీ హరిప్రసాద్‌రెడ్డి,

వైస్ ఎంపీపీ సుజాత, డీఎస్పీ రామచంద్ర, అర్బన్ సీఐ సుబ్బారెడ్డి, ఎంపీడీవో హరిబాబు, ఎంఈవో ఇందిరాదేవి, కో-ఆప్షన్ మెంబరు సుభాన్‌రాజా, రేణిగుంట మండల వైకాపా మైనారిటీ అధ్యక్షుడు అబ్దుల్ ఖాదర్, రేణిగుంట పట్టణ వైకాపా అధ్యక్షుడు ప్రభాకర్, రేణిగుంట సర్పంచ్ నగేష్, ఉప సర్పంచ్ ఇర్ఫాన్, తూకివాకం సర్పంచ్ మునిశేఖర్‌రెడ్డి, గాజులమండ్యం సర్పంచ్ గంగారి రమేష్, కరకంబాడి కార్యదర్శి రామాంజనేయులరెడ్డి, వైకాపా నేతలు దయాకర్‌రెడ్డి, యోగీశ్వర్‌రెడ్డి, రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

దాతలకు సత్కారం: ఉప ముఖ్యమంత్రిచే పూజలు

శ్రీకాళహస్తి,అక్టోబర్ 20 ప్రభాతవార్త: శ్రీకాళహస్తీశ్వరాలయం గురువారం అతిధులతో కిట కిటలాడింది. ఉదయం రాష్ట్ర ఉపముఖ్యమంత్రి నారాయణ స్వామి ఆలయానికి వచ్చారు.ఆయనకు ఆలయ మర్యాదలతో ప్రోటోకాల్‌మేరకు దక్షిణ గోపురం వద్ద స్థానిక శాసనసభ్యుడు బియ్యపు మధుసూధనరెడ్డి,ధర్మకర్తల మండలి చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు సారధ్యంలో స్వాగతం పలికారు.ఆలయంలో నిర్వహించే కాలసర్పదోష,రాహుకేతుదోష నివారణ పూజలను ఆయన భక్తి శ్రద్ధలతో జరిపించుకున్నారు. సహస్రలింగేశ్వరుని ఆలయం వద్ద వేదపండితులు వేద మంత్రాలతో రాహుకేతుదోష నివారణ పూజలు జరిపించారు.తరువాత స్వామి అమ్మవార్ల అంతరాలయ దర్శనం చేసుకున్నారు.

అలాగే ఆలయంలోని సూక్ష్మనంది కి సుమారు రూ.26లక్షల విలువ కల్